శ్రీశైలంలో సర్వ దర్శనానికి ఆన్‌లైన్ టోకెన్లు



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 5 జూలై 2025 ‖ సంపుటి:9 ‖ సంచిక:189 ‖ పేజీలు:8+4 ‖ వెల: రూ.5


GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

మినిమమ్ బ్యాలెన్స్ షరతు ఎత్తేసిన 5 బ్యాంకులు




2

# ‘పీ4’తో సంక్షేమ పథకాల్లో కోత ఉండదు: సీఎం చంద్రబాబు



**అమరావతి:** సీఎం చంద్రబాబు నేతత్వంలో సచివాలయంలో ‘స్వర్ణాంధ్ర-పీ4’ ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం జరిగింది. జూమ్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో పీ4- పథకం సమర్థంగా అమలు చేసేందుకు రెండు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పీ4 అమలు, పర్యవేక్షణ కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయి చాప్టర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. కమిటీల్లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలోనే ‘స్వర్ణాంధ్ర-పీ4’లోగోను సీఎం ఖరారు చేశారు. పీ4 అమలులో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆగస్టు 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలు, లక్ష మంది మార్గదర్శులను గుర్తించాలని నేతలకు, అధికారులకు సూచించారు. అయితే, ఈ పథకం అమలుపై ప్రజల్లో సందేహాలున్నాయన్న విషయాన్ని ఎమ్మెల్యేలు సీఎం దష్టికి తీసుకొచ్చారు. పీ4 వల్ల సంక్షేమ పథకాల్లో కోత ఉండదని, ఇది సంక్షేమానికి అదనమని సీఎం స్పష్టం చేశారు. పీ4 పథకంపై ప్రజల్లో అపోహలను తొలగించాలన్నారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం, నిరంతర గైడెన్స్ ఇవ్వడమే మార్గదర్శులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.



## వైకాపా ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తాం

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**మార్కాపురం:** సగటు మనిషిని బెదిరించడం వల్లే వైకాపాకు ఈ పరిస్థితి వచ్చిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రకాశం జిల్లా నరసింహపురంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో పవన్ ప్రసంగించారు. ‘‘2029లో అధికారంలోకి వస్తే మా అంతు చూస్తామని వైకాపా నేతలు అంటున్నారు. మీరు అధికారంలోకి రావాలి కదా? ఎలా అధికారంలోకి వస్తారో మేమూ చూస్తాం. వ్యక్తిగతంగా నాకు ఎవరిపై కక్ష ఉండదు. గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదు. రౌడీయిజం, గూండాయిజంతో భయపెట్టి వేధించారు. మంచినీరు అందించాలన్న ధ్యాస కూడ గత పాలకులకు లేదు. ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఆపేస్తున్నామని కేంద్రం మాకు చెప్పింది. నీళ్లు ఇవ్వడం రాష్ట్రానికి సంబంధించింది. కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసి అన్ని విషయాలు వివరించా. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పాం. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ మొదటి విడత రూ.1,290 కోట్లతో శంకుస్థాపన చేసుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకమిదే. దాదాపు

...మిగతా 2లో

## సెప్టెంబర్‌లో ‘నైపుణ్యం’ పోర్టల్ ప్రారంభించాలి

### మంత్రి నారా లోకేశ్ ఆదేశం



**అమరావతి:** ‘నైపుణ్యం’ పోర్టల్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. నైపుణ్యాభివద్ధి శాఖ అధికారులతో ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ మేరకు ‘ఎక్స్’లో ఆయన పోస్ట్ చేశారు.

‘‘ఉద్యోగ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్ విధానంలో నైపుణ్యం పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తాం. 90 రోజులపాటు ఈ కార్యక్రమం చేపడతాం. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమేటిక్‌గా రెజ్యూమ్ సిద్ధమయ్యేలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించాను. ఇటీవల ఢిల్లీ పర్యటన అనంతరం ఐటీఐల అభివద్ధికి హబ్ అండ్ స్పోక్ విధానంలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం ద్వారా రూ.600 కోట్లు కేటాయించాం’’ అని లోకేశ్ పేర్కొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

### ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించిన మంత్రి టి.జి భరత్



**కర్నూలు, జులై 04, మనం న్యూస్:** తమ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 45వ వార్డు అశోక్ నగర్ లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా

...మిగతా 2లో

## అల్లూరి స్మారక మందిరం ఏర్పాటుకు సీఎం రమేశ్ భారీ విరాళం

**అనకాపల్లి:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక మందిరం ఏర్పాటుకు విరాళం ప్రకటించారు. ఎంపీ సీఎం రమేశ్ రూ.30 లక్షలు, రాష్ట్ర హోంమంత్రి అనిత రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కష్ణదేవిపేటలో ఈ స్మారక మందిరం ఏర్పాటు చేయనున్నారు.

## ఆగస్టు 15 నుంచి ఉచితంగా పాస్‌బుక్‌ల పంపిణీ: మంత్రి అనగాని



**అమరావతి:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సలహాలు ఇస్తున్నామన్నారు. రెవెన్యూశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. భూములకు ఆధార్, సర్వే నంబర్ల అనుసంధానంతో సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్ ద్వారా వచ్చిన 4.63లక్షల ఫిర్యాదుల్లో 3.99 లక్షల ఫిర్యాదులు పరిష్కరించినట్లు తెలిపారు.

‘‘ప్రతి భూమి సమగ్ర సమాచారం ఉండేలా చర్యలు తీసుకుంటాం. క్యూఆర్ కోడ్ ఉండే పాస్ పుస్తకాలు తీసుకువస్తున్నాం. దీంతోపాటు వివిధ రకాల భూములకు రంగుల పాస్‌బుక్ కేటాయిస్తాం. ఆగస్టు 15 నుంచి ఉచితంగా వాటిని పంపిణీ చేస్తాం. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే పూర్తి చేస్తాం. శ్మశానవాటికల నిర్మాణానికి రూ.138 కోట్లు విడుదలకు ఆమోదం తెలిపాం. ప్రతి పేదవాడికి నివాసయోగ్యమైన ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

## అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ

**హైదరాబాద్, జూలై 4:** సినీ నిర్మాత అల్లు అరవింద్ ను ఈడీ ప్రశ్నించింది. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్ లో మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018-2019లో జరిగిన బ్యాంక్ స్కామ్ ఈడీ విచారణను కొనసాగిస్తోంది. బ్యాంకులో అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై

...మిగతా 2లో



## బీజేపీకి మహిళా అధ్యక్షురాలు?

### రేసులో దక్షిణాది నేతలు.. నిర్మలా సీతారామన్, పురందేశ్వరి, వానతీ శ్రీనివాసన్







2

## గ్రాడ్యుయేషన్ ముగింపు కాదు.. కలల సాకారానికి ఆరంభం

### గవర్నర్ అబ్దుల్ నజీర్



కాకినాడ: విద్య అంటే డిగ్రీలు, బట్టీ చదువులు, 100కి 100 మార్కులు కాదని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. జేఎన్టీయూ కాకినాడ 11వ స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రమణ్యానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ‘‘గ్రాడ్యుయేషన్ జీవితంలో ఒక మంచి చాప్టర్. ఇది ముగింపు కాదు. మీ కలల సాకారం చేసుకోవడానికి ఆరంభం. యూనివర్సిటీలు టెక్నాలజీపై ఫోకస్ పెట్టాలి. అమరావతి కేంద్రంగా క్వాంటం వ్యాలీ రాబోతోంది. అమరావతి అభివద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి’’అని గవర్నర్ పిలుపునిచ్చారు.

## సాయం పేరుతో పౌరుల్ని చంపేస్తున్నరు

### గాజాలో వికృత పరిస్థితుల గురించి వివరించిన అక్కడి కాంట్రాక్టర్

### ఆహార పంపిణీ కేంద్రాలకు వెళ్తే తలలపై కాలుస్తున్నరు: బాధిత వ్యక్తి






**న్యూయార్క్, జూలై 4:** ఇజ్రాయెల్ దాడుల వల్ల గాజాలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడి సామాన్యుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మరోవైపు గాజాలోకి మానవీయ సాయం చేరకుండా ఇజ్రాయెల్ కట్టడి చేసింది. ఈనేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ల మద్దతు ఉన్న దాతృత్వ సంస్థ, గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) పాలస్తీనీయులకు

...మిగతా 2లో

## విజయే మా సీఎం అభ్యర్థి





### ప్రకటించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)

### బీజేపీ, డీఎంకేలు మా సైద్ధాంతిక శత్రువులన్న సినీ హీరో, పార్టీ వ్యవస్థాపకుడు

**చెన్నై, జూలై 4:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్న నేపథ్యంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) తమ పార్టీ సీఎం అభ్యర్థిగా వ్యవస్థాపకుడు, సినీనటుడు విజయ్‌ను ప్రకటించింది. శుక్రవారం చెన్నైలో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. వచ్చే నెలలో భారీ ఎత్తున రాష్ట్ర మహాసభలు

...మిగతా 2లో

# వైకాపా ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తాం

(మొదటి పేజీ తరువాయి)

10 లక్షలకు పైచిలుకు జనాభాకు తాగునీటిని అందించబోతున్నాం.

**ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి**

గత పాలకులు రూ.లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటిని తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నాం. వారి హయాంలో ఎలాంటి తాగునీటి పథకం చేపట్టలేదు. ఎన్నికల ముందు శిలాఫలకాలు వేసేందుకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. సకాలంలో నిధులు వస్తే 18 నుంచి 20 నెలల్లో పూర్తి చేస్తాం. నేను ప్రత్యేకించి ఈ పథకాన్ని పర్యవేక్షిస్తా. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి. వైకాపా హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారు. ఆక్రమణకు గురైన ఆలయాల భూములను తిరిగి వెనక్కి తీసుకునే ప్రక్రియ ప్రారంభించాం. వాటికి రక్షణ కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది'' అని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)

అని తెలుసుకున్నారు. ఏ ఏ పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కింది స్థాయి నుండి పై స్థాయి నాయకుల వరకు అందరం ఇంటింటికి తిరిగి ఏడాది పాలనను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరించి ప్రజలు ఏమైనా సమస్యలు చెబితే తెలుసుకొని పరిష్కరించే దిశలో ముందుకు వెళ్తున్నాం అన్నారు. మాటిచ్చిన విధంగా అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కర్నూలు నగరంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు ప్రధానంగా మెడికల్ కాలేజీ ఎదురుగా రోడ్డు చిన్నగా ఉన్న నేపథ్యంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఈ విషయంలో ఇప్పటికే సంబంధిత దుకాణాల యజమానులతో మాట్లాడినట్లు చెప్పారు. నెలకు రూ.300ల అద్దె చొప్పున 25 సంవత్సరాల వరకు షాపులు కేటాయించి, ఆ తర్వాత మళ్లీ వారికే కేటాయించేలా రెన్యువల్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చిన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు అలాగే చైతన్య నగర్ లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తానని టి.జి భరత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు ధరూర్ జేమ్స్, ముంతాజ్, సంజీవలక్ష్మి, సీనియర్ నాయకులు ఆకేపోగు ప్రభాకర్, కార్పొరేటర్లు మాణిక్యమ్మ, పరమేశ్, మాజీ కార్పొరేటర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు,

# ఆయనే మా సీఎం అభ్యర్థి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని కూడా పార్టీ ప్రతిపాదించింది. తమ పార్టీ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తమిళనాడు ఎన్నికల్లో వేర్పాటు వాదులతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడిన ఆయన.. విషపూరిత రాజకీయాలు తమిళనాడులో చెల్లవన్నారు. బీజేపీతో చేతులు కలపడానికి తమ పార్టీ ఏమీ డీఎంకే, అన్నాడీఎంకే కాదన్నారు. ఆ రెండిటితో తమకు పొత్తులు ఉండబోవని స్పష్టం చేసిన విజయ్.. ఆ రెండు పార్టీలను తమకు సైద్ధాంతిక శత్రువులుగా పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆంగ్ల భాషపై చేసిన వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవని పేర్కొంది. ఆయన వ్యాఖ్యలు తమిళనాడు ద్విభాషా విధానంపై ప్రత్యక్ష దాడి అని అభివర్ణించింది. తమిళనాడుపై హిందీ, సంస్కృత భాషల్ని రుద్దడాన్ని తమ పార్టీ ఎప్పటికీ అంగీకరించబోదని పునరుద్ఘాటించారు.

# ఇంటింటా సూపరిపాలనకు భారీ స్పందన



**ఆదోని, జూలై 04: (మనం న్యూస్):** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదోని నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈరోజు సలకలకొండ, బసరకోడు, అలసంద గుత్తి గ్రామాల్లో టిడిపి శ్రేణులు ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం గత ఏడాది పరిపాలనలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించాయి. ప్రతి పల్లె, ప్రతి వార్డులో ప్రజల అభిప్రాయాలను సేకరించి, సమస్యలను విన్నవించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ఆదోని టిడిపి ఇంచార్జ్ మీనాక్షి నాయుడు, రాష్ట్ర కురువ-కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఆదోని ఇంచార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మదిరి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, ఎల్ఎల్సి చైర్మన్ రామస్వామి,మాజీ ఎంపీపీ మురళీ కపటి, మాజీ సర్పంచ్ మాధవ్, తెలుగు యువత నాయకులు వెంకటేష్ చౌదరి, మండగిరి , లక్ష్మీ నారాయణ తదితరులు హాజరై ప్రజల్లో జోష్ నింపారు. సూపరిపాలనలో ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తాం. ఇదే మా లక్ష్యం అని మీనాక్షి నాయుడు అన్నారు. కూటమి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరుస్తామని గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. గ్రామస్తులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామంటూ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

# మంత్రాయం నియోజకవర్గంలో అభివృద్ధిని ఎవరు అడ్డుకోలేరు

- **తెదేపా ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి**



**కౌతాళం, జులై 04 మనం న్యూస్:** అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెడుతూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని తెలుగు యువత సురేష్ నాయుడు పేర్కొన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో శుక్రవారం కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలోని పర్యటించిన తెదేపా ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రాయం నియోజకవర్గంలో అభివృద్ధిని ఎవరు అడ్డుకోలేరని పార్టీలకతీతంగా చేసి చూపుతానని, సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు.వైఎస్సార్సీపీ పాలనకు కూటమి ప్రభత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకున్నారని ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఏడాదిగా రాష్ట్రం చాలా ప్రశాంతంగా ఉందన్నారు. అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెడుతూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ విజయాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ప్రభుత్వ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌతలం మండల నాయకులు సురేష్ నాయుడు,సతీష్ నాయుడు, ఎల్ఎల్సి చైర్మన్ టిప్పు సుల్తాన్, సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు అడివప్పగౌడ్, చౌదరి బసవ మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట బీమా నమోదు చేసుకోండి

- **ఏవో సురేష్ యాదవ్**

**తుగ్గలి జులై 4(మనం న్యూస్):** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పి ఎం ఎఫ్ బి వై) పథకం కింద ఖరీఫ్ 2025-26లో పంటలు సాగు చేస్తున్న రైతు సోదరులందరూ తమ పంటలకు పంట బీమా చేసుకోవాలని తుగ్గలి మండల వ్యవసాయ అధికారి సురేష్ యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో విలేకరులకు తెలిపారు.అయన మాట్లాడుతూ ఫసల్ బీమా కింద ఉల్లిగడ్డ, ఎర్ర మిరపకాయ, జొన్నలు వరి, మొక్కజొన్న, సజ్జలు మొదలగు పంటలకు ప్రకటించడం జరిగిందని ఏవో తెలిపారు.వేరుశనగ పంటను వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ప్రకటించారని చెప్పారు.కొర్ర - 32 రూపాయలు. మొక్కజొన్న-66 రూపాయలు, ఉల్లి -90రూపాయలు, సజ్జలు -32రూపాయలు, కందులు- 44రూపాయలు, ఎండుమిర్చి-360 రూపాయలు, జొన్నలు-38రూపాయలు, ప్రత్తి - 2000రూపాయలు, వేరుశనగ- 560 రూపాయలుగా ఉందన్నారు. రైతులు తమ ఆధార్,పొలం పాస్ పుస్తకం లేదా కౌలుదారు కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సులు మీయొక్క రైతు సేవ కేంద్రంలో ఉన్న సిబ్బందికిఇచ్చి పంటల బీమా చెల్లించుకోవచ్చని వారు తెలియజేశారు.

# సాయం పేరుతో పౌరుల్ని చంపేస్తున్నరు

(మొదటి పేజీ తరువాయి)

ఆహారం సరఫరా చేసే కేంద్రాలను ఏర్పాటుచేసింది. అయితే.. శరణార్థులు ఆహారం కోసం వస్తున్న సమయంలో ఆ కేంద్రాల వద్ద మహిళలు, వృద్ధులు, పిల్లలపై భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారని మాజీ సెక్యూరిటీ కాంట్రాక్టర్ ఓ మీడియా సంస్థకు తెలిపారు. ఎవరికీ ఎటువంటి ముప్పు కలిగించని, ఆకలితో అలమటిస్తున్న పౌరులపై కాల్పులు జరపడంతో వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఈ ఆరోపణలను గాజా మానవతా సంస్థ(జీహెచ్ఎఫ్) ఖండించింది. ఆహార పంపిణీ కేంద్రాల వద్ద పౌరులపై ఎలాంటి కాల్పులు జరగలేదని వివరణ ఇచ్చింది. సహాయ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన కెమెరాలలో రికార్డు అయిన దృశ్యాల ప్రకారం.. అధిక ఆహారం చేజిక్కించుకోవాలన్న ఆతృతలో పలువురు పాలస్తీనియన్లు ప్రమాదకరమైన ఆయుధాలతో సిబ్బందిపై దాడికి ప్రయత్నించారని..వారిని నిలువరించడానికి ఎదురుకాల్పులు చేయాల్సి వచ్చిందని పేర్కొంది. ఈనేపథ్యంలో మరికొంతమంది చిన్నారులు, వృద్ధులు గాయాలపాలయ్యారని తెలిపింది. మరికొన్నిచోట్ల ప్రజలు ఆహారం కోసం వచ్చే మార్గంలో కాకుండా పక్కకు వెళ్తుండడంతో వారిని అదుపు చేయడానికి ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరిపిందని.. అయితే ఈ ఘటనల్లో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని తెలిపింది. ఈవిషయంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టినట్లు ప్రకటించింది.

**తలలపై కాలుస్తున్నారు..**

ఇజ్రాయెల్-గాజాల మధ్య యుద్ధం కొనసాగుతుండడంతో గాజాలోని ప్రజలు ఆకలి బాధతో జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. రోజురోజుకూ వారి ఆహార సంపాదన ప్రాణాంతకంగా మారుతోంది. గాజాకు అందుతున్న సాయమంతా జీహెచ్ఎఫ్ కు చెందిన నాలుగు పంపిణీ కేంద్రాలకు చేరుతోంది. అవి ఇజ్రాయెల్ మిలిటరీ జోన్లలో ఉన్నాయి. అతికొద్ది సాయమే కొన్ని గ్రూపులకు చేరుతుండటంతో తీవ్ర తొక్కిసలాటలు చోటుచేసుకుంటున్నాయి. జీహెచ్ఎఫ్ కేంద్రాల వద్ద ప్రజలపై దాదాపుగా రోజూ కాల్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే చాలాసార్లు ఆహారం కోసం వెళ్లిన గాజా పౌరుడు మహమ్మద్ సాఖెర్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. తమ ముగ్గురు పిల్లలకు ఆహారం కోసం సహాయక కేంద్రాలకు వెళ్తున్న ప్రతిసారీ తలల పైనే కాల్చుతున్నారని, అంతా వెనక్కి వెళ్లాలని డ్రోన్లతో ప్రకటిస్తున్నారని తెలిపారు.

# వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణ తనయుడు వంగవీటి రాధాకృష్ణ



**విజయవాడ తూర్పు, జూలై 04 (మనం న్యూస్):** విజయవాడ 17వ డివిజన్ రాణిగారితోటలో వంగవీటి మోహన రంగా 78వ జయంతి సందర్భంగా ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాదాకృష్ణ తన తండ్రి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రంగా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన కార్యక్రమంలో తనయుడు రాదాకృష్ణతో పాటు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టిడిపి రాష్ట్ర నాయకులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవనకుమార్, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభానులు హాజరయి వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగవీటి రాదాకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి వంగవీటి రంగా ఆశయాల కోసం తాను నిరంతరం పోరాడుతానని చెప్పారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అంటూ ఆయన సేవలను కొనియాడారు. పేద ప్రజల హక్కుల కోసం వంగవీటి మోహన్ రంగ చివరి శ్వాస వరకు కృషి చేశారన్నారు. వంగవీటి మోహన్ రంగా ఒక వర్గానికి చెందిన నేత కాదనీ, ఆయన ప్రజా నాయకుడని అన్నారు.

# విజయవాడలో స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలపై సిపిఎం మహా ధర్నా



**విజయవాడ సెంట్రల్, జూలై 04 (మనం న్యూస్):** విజయవాడలో శుక్రవారం నాడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ అద్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు ప్రజల నుండి విశేషమైన స్పందన వచ్చింది. సుమారు వందలాది మంది వినియోగదారులు, కార్యకర్తలు 50 వేల దరఖాస్తులతో తరలివచ్చారని సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు అన్నారు. విద్యుత్ అధికారులకు వినతి పత్రం సమర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ దొంగ చాటున మీటర్లు బిగిస్తే పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు ఇవ్వాలంటూ సిపిఎం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను తిప్పి కొట్టండి, పాలకులకు బుద్ధి చెప్పండంటూ నినాదాలు చేశారు. విజయవాడ సిపిడిసిఎల్ ప్రధాన కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్త మీటర్లు వద్దు. బిగించిన మీటర్లు తొలగించాలి. విద్యుత్ సర్దుబాటు చార్జీలు, బిల్లులు తగ్గించాలి. అదాని, సెకి తదితర కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు రద్దు చేయాలనే నినాదాలతో వారు మహాధర్నా నిర్వహించారు. గత పది రోజుల నుండి స్మార్ట్ మీటర్లు, భారాలకు వ్యతిరేకంగా పోరుబాట సాగించినట్లు తెలిపారు. ఇంటింటికీ తిరిగి వినతి పత్రాలు స్వీకరించామనీ, కరపత్రాలు పంపిణీ చేశామని, పలు చోట్ల సభలు, సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు.

# యువతకు స్ఫూర్తి అయినటువంటి స్వామి వివేకానంద



**బేతంచేర్ల, జూలై 4(మనంన్యూస్):** యువమోర్చా అధ్యక్షుడు కుంచ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో వారికి పుష్పాంజలి ఘటించారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మధుమోహన్ రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గారి స్వాతంత్ర్య పోరాటం దేశ స్వాతంత్రానికి ఎంతో ఉపయోగపడిందని తెలియజేశారు అలానే స్వామి వివేకానంద వారి చికాగో ప్రయాణం మరియు వారి సందేశం వారి గురువుల నుండి వారు పొందిన విద్యా విలువలను నేటి యువత అతి చిన్న వయసులోనే దేశం కోసం తుది శ్వాస విడిచిన వీరి ఇరువురిని ఆదర్శంగా తీసుకొని దేశ ప్రగతికి అభ్యున్నతికి పాటుపడాలని వివరించారు కార్యక్రమంలో టౌన్ ఉపాధ్యక్షుడు మెకానిక్ రమణ నారాయణరెడ్డి ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ రవిశంకర్ నాయుడు కార్యదర్శి టైలర్ రాముడు సముద్రాల మణికంఠ బూత్ కమిటీ అధ్యక్షుడు ఎల్ఐసి శ్రీనివాసులు బిజెపి కిసాన్ మోర్చాసీనియర్ నాయకులు బాలరాజు శివరాం రెడ్డి మనోహర్ బిజెపి కార్యకర్తలు మధు మద్దిలేటి స్వామి నూర్ అహ్మద్ యువమోర్చా ఉపాధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు అనంతరం బిజెపి బాలరాజు సభ్యులందరితో వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు.

# జులై 9న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



**కర్నూలు, జులై 04, మనం న్యూస్:** లేబర్ కోడు లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26,000 అమలు చేసి కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు చేయాలని అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని ప్రధాన డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాల తలపెట్టిన జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నేడు కర్నూల్ నగరంలోని సలాం ఖాన్ భవన్లో ఉద్యోగ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఏఐటియుసి నగర కార్యదర్శి జి చంద్రశేఖర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జూ ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఎస్ ము నెప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి బిజెపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాల ను ఎండబడుతూ 7 వతేదీన స్కూటర్ ర్యాలీలను,9వ తేదీ జరుగు సార్వత్రిక సభను కర్నూలు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగ కార్మికులుపాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు ఎం. బత్కన్న, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, ఏఐయుటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగన్న, హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా ఎల్ఐసి యూనియన్ నాయకులు సునీల్ కుమార్ రమేష్ ఎస్డబ్ల్యుఎఫ్ నాయకులు రాయుడు, బిఎస్ఎన్ఎల్ నాయకులు రమణ ఏఐటీయూసీ నగర నాయకులు బి.వెంకటేష్ రామాంజనేయులు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుల్లగం మద్దిలేటి మెడికల్ నాయకులు నూర్ భాషా భీమన్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వర్ కృష్ణారెడ్డి,ప్రభాకర్ మహమూద్ నల్లన్న, అబ్దుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో బసవేశ్వర సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ

**ఆదోని, జులై 04: (మనం న్యూస్):** ఆదోని డీఎస్పీ ఆదేశాల మేరకు బసవేశ్వర సర్కిల్ బైపాస్ రోడ్డులో విసిబుల్ పోలీసింగ్లో భాగంగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని వాహనాలపై జరిమానాలు విధించారు. అలాగే వాహనదారులకు అవసరమైన డాక్యుమెంట్లు, ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. పోలీసులు చేపట్టిన ఈ తనిఖీలు ప్రజల్లో పటిష్టతను కలిగించాయి.

# కూటమి సంక్షేమ పాలనలో ప్రజల్లో సంతృప్తి

- **'సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్న టీడీపీ నేతలు**

**తుగ్గలి జులై 4(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని,భావితరాల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర,మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే కే. యి శ్యామ్ కుమార్ ఆదేశాలు మేరకు టీడీపీ మండల ఉపాధ్యక్షులు వెంకటరాముడు చౌదరి ఆధ్వర్యంలో'సూపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తుగ్గలి పరిధిలోని సూర్యతాండ,మిటే తాండ, బాటతాండ గ్రామాల్లో టీడీపీ నాయకులు రాము నాయక్ సమక్షంలో టిడిపి శ్రేణులతో ప్రతి గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు వారు వివరించారు.అనంతరం వారు మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.తల్లికి వందనం,ఉచిత గ్యాస్ సిలి సిలిండర్లు,పెన్షన్ పెంపు వంటి కార్యక్రమాలు అమలు చేసామన్నారు.రాష్ట్ర ప్రజలకు త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం,రైతులకు అన్నదాత సుఖీభవ,



నిరుద్యోగ భృతి అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి మాజీ సర్పంచ్ వెంకటస్వామి,మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్,మాజీ సర్పంచ్ పక్కిరప్ప,మాజీ సర్పంచ్ బర్మా విరేష్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడ్, బాలన్న,మిద్దె వెంకటేశ్వర్లు, మిద్దె రవి కుమార్, సంఘాల కృష్ణ,మీసాల శేఖర్,గుండమ్మయ్య, రమేష్, జై రాముడు,తిరుపాల్ నాయక్,శంకర్ నాయక్,బి. లక్ష్మణ్ నాయక్,ఆర్.లక్ష్మణ్ నాయక్,స్వామి నాయక్,ఫీల్ అసిస్టెంట్లు లక్ష్మణ్ నాయక్, విజయేంద్ర నాయక్, ఏడవలి తిమ్మప్ప,బోలా రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో సర్వ దర్శనానికి ఆన్‌లైన్ టోకెన్లు

**శ్రీశైలం, జూలై4:** శ్రీశైలం ఆలయంలో 'ఉచిత స్పర్శ దర్శనం'టోకెన్ల జారీకి ఆన్లైన్ విధానం ప్రవేశ పెడుతున్నట్లు ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభించిన ఉచిత స్పర్శ దర్శనానికి భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆన్లైన్ ద్వారా టోకెన్లను జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 3.45 గంటల వరకు ఉచిత స్పర్శ దర్శనం ఉంటుందన్నారు. వచ్చేవారం నుంచి ఆన్ లైన్ లో టోకెన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

# మినిమమ్ బ్యాలెన్స్ షరతు ఎత్తేసిన 5 బ్యాంకులు

**హైదరాబాద్, జూలై 4:** మినిమమ్ బ్యాలెన్స్ లేని పొదుపు ఖాతాలపై బ్యాంకులు అపరాధ రుసుమును విధిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఛార్జీల నుంచి కొన్ని బ్యాంకులు మినహాయింపు కల్పించి ఖాతాదారులకు ఊరటనిచ్చాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు జూలై 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది.

# అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది ఈడీ. అల్లు అరవింద్‌ను బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్ గా ఉన్న వారి స్టేట్మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

**బాధ్యత గల పౌరుడిగా హాజరయ్యా..**

విచారణ అనంతరం అల్లు అరవిద్ మాట్లాడుతూ.. '2017లో ఒక మైనర్ వాటాదారుడిగా ఉన్న ఓ ప్రాపర్టీ కొనుగోలు చేశా. దానిపై ఈడీ సమస్య ఉంది. మైనర్ వాటాదారుడు బ్యాంకు రుణం తీసుకుని చెల్లించలేదు. అకౌంట్స్ బుక్ లో నా పేరు ఉండటం వల్ల ఈడీ విచారణకు పిలిచింది. బాధ్యత గల పౌరుడిగా విచారణకు హాజరై వివరణ ఇచ్చాను'అని తెలిపారు.

# బీజేపీకి మహిళా అధ్యక్షురాలు?

**ఢిల్లీ, జూలై 4:** పార్టీ సంస్థాగత ఎన్నికలను బీజేపీ వేగంగా కొనసాగిస్తోం ది. జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో అధ్యక్ష నియామకా లు పూర్తి కావాలి. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులు ఖరారయ్యా రు. ఈ నేపథ్యంలోనే ఈసారి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ కథనాలు వెలువడుతున్నా యి. దీనితో పాటు జాతీయ అధ్యక్ష పదవి రేసులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ భాజపా ఎంపీ పురందేశ్వరి, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్ లున్నట్టు కూడా ఆ కథనాలు తెలుపుతు న్నాయి. పార్టీలో మహిళల కు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీనితో ఈ సారి ఖాయంగా మహిళా అధ్యక్షురాలు రానున్నారని భావించాలి.



# రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసిన ఏడిఏ

**బేతంచేర్ల, జూలై 4(మనంన్యూస్):** ఎన్ ఎం ఈవో ఓఎస్ (నేషనల్ మిషన్ అన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ సీడ్స్ ) పథకం వాల్యూ చైన్ క్లస్టర్ పథకం ద్వారా బేతంచెర్ల మండలం కి వేరుశెనగా విత్తనాలు 75క్వింటాల్ అందుబాటులో ఉన్నాయని అందులో భాగంగా హెచ్ కొట్టాలా గ్రామం నందు రైతులకు సీడ్ రిజిస్ట్రేషన్ చేసి విత్తన పంపిణీ ఏడిఏ ఆర్. డోన్ సునీత రైతులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి బి, విజయ్ కుమార్ రెడ్డి ఏఈఓ మహమ్మద్ వి ఏ ఏ వేణు ఎంపీఈవో లు రాఘవ బాలకృష్ణ మరియు రైతులు పాల్గొన్నారు అనంతరం డోన్ ఏ ఏ డి ఏ ఆర్ సునీత బేతంచెర్ల మండల వ్యవసాయ కార్యాలయం నందు వీఆర్వో లు మరియు వి ఏ ఏ లతో సమావేశం నిర్వహించారు సమావేశంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందే వివరాలు తెలిపారు అర్హులైన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

## ప్రశాంతంగా.. మొహర్రం

**మదనపల్లె, జూలై 4(మనం న్యూస్):** మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ వేడుకలలో అల్లర్లకు తావుండరాద న్నారు. అందరు సోదరభావంతో మెలగాలన్నారు. జిల్లాలో మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో ముగిసే విధంగా సహకరించాలని ఎస్పీ కోరారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# శాస్త్రోక్తంగా సౌమ్యనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**తిరుపతి, జూలై 4(మనం న్యూస్):** అన్నమయ్య జిల్లా నందలూరులోని శ్రీసౌమ్యనాథ స్వామి వారి ఆలయంలో జూలై 05 నుండి 13వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం అంకురార్పణ చేపట్టారు. ముందుగా సాయంత్రం 6 గంటల నుండి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం నిర్వహించారు. జూలై 05వ తేదీ శనివారం ధ్వజారోహణంతో శ్రీ సౌమ్యనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో పలు కైంకర్యాలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 - 11.00 గం.ల వరకు సింహలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 05 గం.లకు ఊంజల్ సేవ, రాత్రి 07.00 గం.లకు యాళివాహనం, చతుస్థానార్చనము జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలలో స్వామివారు విహరిస్తారు. ఆలయ చరిత్ర : శ్రీ సౌమ్యనాథ స్వామివారి ఆలయ నిర్మాణానికి 11వ శతాబ్దంలో చోళవంశరాజు కుళోత్తుంగ చోళుడు శ్రీకారం చుట్టినట్లు చరిత్ర చెబుతోంది. చోళ, పాండ్య, కాకతీయ, విజయనగర రాజులచే 17వ శతాబ్దం వరకు ఆలయం నిర్మాణం కొనసాగి, మట్టిరాజుల కాలంలో ఆలయం ప్రసిద్ధి చెందింది. 12వ శతాబ్దంలో కాకతీయ ప్రతాపరుద్రుడు రాజగోపురం కట్టించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రసిద్ధ వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్ళపాక గ్రామం నందలూరుకు దగ్గరలో ఉన్నందున అన్నమాచార్యుల వారు శ్రీవారిని దర్శించి స్వామివారిపై కీర్తనలు రచించినట్లు ప్రతీతి. ఈ ఆలయంలో ఎటువంటి దీపం లేకున్నా స్వామివారు ఉదయం నుండి సాయంకాలం వరకు దేదీప్యమానముగా వెలుగొందే విధముగా ఆలయమును నిర్మించడం ఒక అద్భుతం. సంవత్సరంలో ఏదో ఒకరోజు సూర్యకిరణాలు స్వామి వారి పాదాలపై ప్రసరించే విధముగా శిల్పులు నిర్మించారు.

వాహనసేవల వివరాలు :05-07-2025 ఉదయం - ధ్వజారోహణం, రాత్రి - యాలి వాహనం, 06-07-2025 ఉదయం - పల్లకీ సేవ, రాత్రి - హంస వాహనం, 07-07-2025 ఉదయం - పల్లకీ సేవ, రాత్రి - సింహ వాహనం, 08-07-2025

ఉదయం - పల్లకీ సేవ, రాత్రి - హనుమంత వాహనం, 09-07-2025 ఉదయం - శేష వాహనం, రాత్రి - గరుడ వాహనం, 10-07-2025 ఉదయం - సూర్యప్రభ వాహనం, రాత్రి - చంద్రప్రభ వాహనం, 11-07-2025ఉదయం - ఆర్జిత కల్యాణోత్సవం (ఉదయం 10 గంటలకు), రాత్రి - గజ వాహనం, 12-07-2025 ఉదయం - రథోత్సవం (ఉదయం 08 గంటలకు), రాత్రి - అశ్వవాహనం, 13-07-2025 ఉదయం - చక్రస్నానం, రాత్రి - ధ్వజావరోహణం, జూలై 11వ తేదీ



ఉదయం 10 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.500/- చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు. జూలై 14న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం జరుగనుంది. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ దిలీప్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**శాంతిపురం, జూలై 4(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కుప్పం నియోజకవర్గ ఇంచార్జి ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి ఎస్ మునిరత్నం, ప్రభుత్వ విప్ కడ పొలిటికల్ ఛైర్మన్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ చొరవతో శాంతిపురం మండలం మఠం పంచాయితీ కి చెందిన దేవమ్మ కు 426735 రూపాయలు, కెనమకులపల్లి పంచాయితీ కి చెందిన మురళి 134460 రూపాయలు,కడపల్లి పంచాయతీ చిలామాకులరాయి గ్రామానికి చెందిన హేమవతి 84463 రూపాయలు , 64 పెద్దూరు కి చెందిన మంజునాథ్ భార్య స్వాతి 100983 రూపాయలు మొత్తం 7 లక్షల 50 వేల రూపాయలు చెక్కులను శాంతిపురం మండల టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో భాదితులకు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ధన్యవాదాలు తెలిపి చంద్రబాబు నాయుడు మాకు చేసిన మేలును మా జీవితాంతం గుర్తుకు ఉంటామని వారికి రుణపడి ఉంటామని అన్నారు. ప్రజల తరపున నాయకులు కూడా ధన్యవాదాలు తెలిపారు.

# తెల్ల దొరల పాలిట సింహ స్వప్నం అల్లూరి

- ప్రొఫెసర్ జి. బాల సుబ్రమణ్యం

**తిరుపతి, జూలై 4(మనం న్యూస్):** మన్యంలో తెల్లదొరల పాలిట సింహస్వప్నం శ్రీ అల్లూరి సీతారామ రాజు అని అనంతపురం ఎస్.కె.యూనివర్శిటీ తెలుగు విభాగం ఆచార్యులు ప్రొ. జి. బాలసుబ్రమణ్యం తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళా మందిరంలో శ్రీ అల్లూరి సీతారామ రాజు 128వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్యం ప్రాంతాలలో తెల్ల దొరల దోపిడిపై అల్లూరి సీతారామ రాజు పోరాటం చేసి యోధుడు అయ్యారని మాట్లాడారు. బడుగు ప్రజల కోసం అల్లూరి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, అల్లూరి కుటుంబ సభ్యులు సైతం నేటికి సామాన్య జీవితాన్ని గడపుతున్నారని ఆయన గుర్తు చేశారు. అల్లూరి సీతారామ రాజు త్యాగాలను చెప్పుకుని లబ్ది పొందాలనే ఆలోచన అల్లూరి



కుటుంబ సభ్యులకు లేదని, కష్టాన్ని నమ్ముకుని బ్రతకాలని, నిరాడంబరంగా జీవితాన్ని గడపడం వారి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. అల్లూరి సీతారామరాజులోని ధాదృత్వం, క్షమాగుణం, దేశభక్తి, ఆధ్యాత్మికత, పోరాడేతత్వంను నవతరం ఆకలింపుచేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టిటిడి ఎస్టేట్ ఆఫీసర్ శ్రీమతి జి. సువర్ణ మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా మన్యం ప్రజల హక్కులకు రక్షణగా ఉంటూ చివరి నిమిషం వరకు పోరాడారని చెప్పారు. అల్లూరి సీతారామ రాజు ఆ రోజుల్లో తప్పని పరిస్థితుల్లో తిరుగుబాటు ధోరణితో హక్కుల కోసం పోరాటం చేశారని, నేటి యువత ఆయనలోని ధైర్యాన్ని మననం చేసుకుని జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కోవాలని సూచించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు ధీరత్వంపై పలువురు వక్తలు ప్రసంగించారు. అంతకు ముందు టిటిడి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి అంజలి ఘటించారు. అన్నమయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు హారతులు సమర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కృష్ణవేణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో (వెల్ఫేర్) ఏ. ఆనందరాజు, పలువురు టిటిడి ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, జూలై 4(మనం న్యూస్):** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిదాయక జీవితం, అందరికి ఆదర్శమని, వారి త్యాగాలను మరువకుండా తప్పక స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని మీటింగ్ హాలు నందు మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు 128వ జయంతి మహోత్సవం సందర్భంగా శ్రీ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి డి.ఆర్. ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో కలసి జిల్లా కలెక్టర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతా రామ రాజు జీవితం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. 1897 జూలై 4న సూర్య నారాయణమ్మ, వెంకట రామరాజు దంపతులకు జన్మించారని, అల్లూరి సీతారామరాజుకు చిన్ననాటి నుంచే



దైవభక్తి, దానగుణం, నాయకత్వ లక్షణాలతో విలక్షణమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నారన్నారు. నిత్యం ధ్యానం, పూజలతో జీవనశైలి కొనసాగించిన ఆయన, స్వాతంత్ర్య సమరయోధుడిగా అవతరించారని తెలిపారు. మన్యం ప్రాంతంలోని గిరిజనుల బాధలను దగ్గరగా గమనించి, తెల్లదొరల దమన రాజకీయానికి వ్యతిరేకంగా గళమెత్తిన అల్లూరి సీతారామ రాజు, ప్రజల్లో చైతన్యం నింపి, వారికి ధైర్యసాహసాలను కలిగించి పోరాట మార్గాలు నేర్పించారన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అన్నారు. ఇతను జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు అని తెలిపారు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే చాలా పరిమితవనరులతో బ్రిటీస్ సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొని వీర మరణం పొందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయిందని కలెక్టర్ అన్నారు. ధ్యానం, దైవభక్తి, ధైర్యసాహసాల సమ్మేళనమైన అల్లూరి జీవితచరిత్ర యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని, ఆయన ఆశయాలు, చూపిన మార్గం నేటి తరాలందరికీ మార్గదర్శకంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివ శంకర్ నాయక్, సుధారాణి, రోజ్ మాండ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెల్ల దొరలకు ఎదురు నిలిచి పోరాడిన వీరుడు అల్లూరి

- చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూలై 4(మనం న్యూస్):** గిరిజనుల అభివృద్ధికి మన్యం అల్లూరి సీతారామరాజు చేసిన కృషి మారువలేనిదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్ నందు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1897 జూలై 4న సూర్య నారాయణమ్మ, వెంకటరామరాజు దంపతులకు జన్మించిన అల్లూరి సీతారామరాజు చిన్ననాటి నుంచే దైవభక్తి, దానగుణం, నాయకత్వ లక్షణాలతో విలక్షణమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నారన్నారు.



నిత్యం ధ్యానం, పూజలతో జీవనశైలి కొనసాగించిన ఆయన, స్వాతంత్ర్య సమరయోధుడిగా అవతరించారని తెలిపారు. గిరిజన తెగ కాని వీరుడు మన్యం ప్రాంత గిరిజనుల కష్టాలు, సమస్యలను చూసి చలించి బ్రిటీష్ వారితో పోరాడి మన్యం ప్రాంత ప్రజల గుండెల్లో ధైర్య సాహసాలను నింపారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారితో పోరాడి అతి చిన్న వయసులోనే వీర మరణం పొందారన్నారు. అల్లూరి సీతారామ రాజు సేవలను గుర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రం లోని ఒక జిల్లాకు అల్లూరి సీతారామ రాజు పేరు పెట్టడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జీవత చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పోరాట పటిమతో లక్ష్యాలను సాధించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో జన్మించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, అల్లూరి సీతారామ రాజు పేరు వింటే ప్రతి ఒక్కరికీ అతని ధైర్య సాహసాలు గుర్తుకు రావాలని, కష్టాలు, ఇబ్బందులు ఉన్న సమయంలో మన్యం వీరుడిని స్మృతికి తెచ్చుకుని ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సి పి ఓ శ్రీనివాస రావు, జిల్లా బి సి సంక్షేమ అధికారి రాబాణీ బాష, ఏఓ వాసుదేవన్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురంలో నూతన పెన్షన్లు పంపిణీ

**శాంతిపురం, జూలై 4(మనం న్యూస్):** మండల పరిధిలోని పంచాయతీలో నూతనంగా అర్హులైన పెన్షన్ లబ్ధిదారులకు శుక్రవారం నాడు పలు పంచాయతీల పరిధిలో నూతన పెన్షన్ అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పలాలు అందించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క లక్ష్యం అని టిడిపి నాయకులు అన్నారు.సంక్షేమ ప్రభుత్వాన్ని పదికాలాల పాటు ఇలాగే కొనసాగించేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పంచాయతీ



సర్పంచ్లు మరియు పలువురు వార్డు సభ్యులు పలువురు నేతలు,సచివాలయ సిబ్బంది మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎర్ర చందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.6 లక్షల జరిమానా
- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి, జూలై 4(మనం న్యూస్):** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహ మూర్తి గారు శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు గారు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు



23/2019 కేసులో ఈ ముద్దాయి అరెస్టయ్యారు. ఈ వ్యక్తి తమిళనాడుకు చెందిన వెల్లియన్ కాగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ నాగపట్ల బీట్, చామల రేంజి ప్రాంతంలో పట్టుబడ్డాడు. వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమ ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

# అధికారంలో ఉన్నప్పుడు మామిడి రైతులకు రాయితీ ఇచ్చారా?

- రెచ్చగొట్టేందుకే వైకాపా పర్యటనలు
- దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వలేని విధంగా ఏపీలో మామిడి రైతులకు కిలో రూ.4 రాయితీ ఇస్తున్నాం
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు, జూలై 4(మనం న్యూస్):** 2019-24 మధ్య అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం మామిడి రైతులకు ఎప్పుడైనా రాయితీ ఇచ్చిందా అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రశ్నించారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో మేయర్ ఎస్.అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మామిడి రైతులపై దొంగ ప్రేమతో వైకాపా అధినేత చిత్తూరు పర్యటనకు వస్తున్నారని..



అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని వైకాపా ప్రభుత్వం, నాయకులు ప్రస్తుతం మామిడి రైతులపై రాజకీయం చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే విమర్శించారు. జిల్లాలో ఏటా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి జరుగుతుందని.. కానీ ఈ సంవత్సరం ఏకంగా 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరగడం, ఇదే సమయంలో పశ్చిమ ఆసియాలో నెల కన్నా యుద్ధ పరిస్థితుల కారణంగా పల్ప్ ఎగుమతులపై గణనీయ ప్రభావం చూపిందన్నారు. ఈ పరిస్థితుల్లో మామిడి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో.. ఫ్యాక్టరీలో కిలో రూ.8 కచ్చితంగా ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 రాయితీగా ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు రాయితీ ఇవ్వలేదని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రమే రైతుల కోసం రాయితీ ప్రకటించారన్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో ఎమ్మెల్యేలు, కలెక్టర్ కలిసి పలు దఫాలుగా ఫ్యాక్టరీ యజమానులతో చర్చించడం జరిగిందని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.8 కచ్చితంగా అమలు చేయాలని స్పష్టంగా చెప్పామన్నారు. కానీ జిల్లాలో అధిక భాగం జ్యూస్ ఫ్యాక్టరీలను వైకాపా నాయకులు తమ గుప్పెట్లో పెట్టుకుని కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వైకాపా నాయకులు సిండికేట్‌గా ఏర్పడి రాంపుల్లో తక్కువ ధరకే మామిడి కొనుగోలు చేస్తున్నారని, నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులను పరామర్శించే పేరుతో ఇప్పటికే రెండు చోట్ల నానా హంగామా చేశారని.. తాజాగా చిత్తూరులో మామిడి రైతులను పరామర్శించే నెపంతో వైకాపా రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. పక్కనున్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రైతులు ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.4 రాయితీపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని.. కానీ రాష్ట్రంలోని వైకాపా వారు మాత్రం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మామిడి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో ఇటీవల కుప్పం పర్యటనలోనూ ముఖ్యమంత్రి గారు మామిడి రైతులు, అధికారులు, పల్ప్ ఫ్యాక్టరీల ప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరను కచ్చితంగా అమలు చేయాలని, ఇదే సమయంలో పల్ప్ పై ఫ్యాక్టరీ యజమానులు కోరిన విధంగా జీఎస్టీ తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. మామిడి రైతులకు ప్రత్యేక గిట్టుబాటు ధర లభించేలా శాశ్వత పరిష్కారం కోసం ఆలోచిస్తున్నారని చెప్పారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, తెదేపా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ పాల్గొన్నారు.

## ఓపెన్ ఫోరమ్‌లో సమస్యలను పరిష్కరించండి

- నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి, జూలై 4(మనం న్యూస్):** పట్టణ ప్రణాళిక విభాగం నిర్వహించే ఓపెన్ ఫోరమ్ లో ప్రజల నుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. ఖాదీ కాలని మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఇండ్లు కోల్పోయిన బాధితులు కమిషనర్ ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం నిర్వహించే ఓపెన్ ఫోరం కార్యక్రమంలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఖాదీ కాలనిలో ఇండ్లు కోల్పోయిన వారికి నిబంధనల మేరకు న్యాయం చేస్తామన్నారు. భవన నిర్మాణాలకు పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేనిదే నిర్మాణాలు సాగించకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో అనుమతులు లేకుండా యాడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించాలన్నారు. యాడ్ ఏజెన్సీల బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ఆయా వార్డుల పరిధిలో సచివాలయం కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు. నగరంలో విచ్చలవిడిగా బ్యానర్లు ఏర్పాటు చేయకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసిపి ఖాన్, ఏసిపి లు బాలాజి,మూర్తి, టిపిబిఓ లు మధుసూదన్, వంశీ, అన్ని సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఉద్యోగుల యోగ క్షేమాలే ముఖ్యం

కంపెనీ లేదా పరిశ్రమ లేదా పని ప్రదేశంలో పని సంస్కృతి (వర్క్ కల్చర్), సానుకూ వాతావరణాలు, ఉద్యోగుల నియామకాలు, కంపెనీ అభివృద్ధి, ఉద్యోగుల నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగుల యోగక్షేమాలు, ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణాన్ని కల్పించడం, జట్టు స్ఫూర్తిని రగల్చడం లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తున్నారు మానవ వనరుల విభాగాలు లేదా హూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్) విభాగ నిపుణులు. హెచ్ఆర్ నిపుణులు కాలానుగుణంగా మారుతూ, నిన్నటి సాంప్రదాయ విధులకు తోడుగా నేటి డిజిటల్ ఏఐ యుగపు టెక్నాలజీలను కూడా ఆకళింపు చేసుకుంటూ తమ విధులను, తమ పరిమితులను విస్తరించుకుంటూ, పునర్నిర్వ చించుకుంటూ, టెక్నాలజీని ఆలింగనం చేసుకుంటూ, ఏఐ టెక్నాలజీలను అనుసంధానం చేసుకుంటూ, సంస్థ సమగ్రాభివృద్ధికి ఊతం ఇస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక సంస్థ లేదా బహుళ జాతి కంపెనీ (ఎంఎన్సి) పురోగతిలో మానవ వనరుల నిపుణుల పాత్ర వెలకట్టలేనిది. కంపెనీ ప్రగతిలో హెచ్ఆర్ నిపుణుల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2019 నుంచి ప్రతి ఏట 20 మే రోజుల అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ హెచ్ఆర్ డే పాటించడం జరుగుతోంది. కంపెనీ లేదా సంస్థలో ఉద్యోగుల శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిగత పురోగతి మాత్రమే తమ లక్ష్యంగా హెచ్ఆర్ నిపుణులు అమూల్య సేవలను అందిస్తున్నారు. 2025 అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవం ఇతివృత్తంగా హూమనిఫై ఏఐ - లీడింగ్ హెచ్ఆర్ టుగెదర్ (ఏఐ యుగంలో మానవీయత - ఐక్యతతో మానవ వనరుల పయనాలు) అనబడే అంశాన్ని తీసుకున్నారు.

అంతర్జాతీయ హెచ్ఆర్ నిపుణుల దినోత్సవ వేదికగా హెచ్ఆర్ విభాగ ఉద్యోగుల పాత్రను దృష్టిలో పెట్టుకొని ప్రోత్సహించడం, సరదా క్రీడలు ఏర్పాటు చేయడం, విజయవంతమైన వ్యక్తులు చేపట్టిన విలక్షణ పద్ధతులను ప్రచారం చేయడం, హెచ్ఆర్ ఉద్యోగులకు బహుమతులు అందించడం లేదా ప్రోత్సాహక వేతనాలను విడుదల చేయడం, ఆ సిబ్బంది సేవలను ప్రస్తుతించడం, సామాజిక మాధ్యమ వేదికగా పురస్కారాలు/అభినందనలు తెలుయజేయడం, హెచ్ఆర్ విభాగ సభ్యుల యోగ క్షేమాలను తెలుసుకోవడం, వారి వ్యక్తిగత లేదా ఉద్యోగ సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. హెచ్ఆర్ నిపుణుల కృషితో పని ప్రదేశంలో ఆశావహ వాతావరణం, పని భద్రత, అధిక ఉత్పత్తి లాంటివి జరుగుతాయని తెలుసుకోవాలి.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# జీవ వైవిధ్యాన్ని రక్షించాలి



సకల జీవులకు ఆధారమైన భూమిపై జీవవైవిధ్యం ఒక సహజ ప్రక్రియ. జీవుల మధ్య భేదాన్నే జీవవైవిధ్యం అంటాం. ఇది జాతి, జన్యు, ఆవరణ, వ్యవస్థల పరంగా ఉంటుంది. ప్రకృతిలో కోట్లాది సంవత్సరాల క్రితం ప్రాణికోటి ఆవిర్భవించినది. ప్రపంచ వ్యాప్తంగా 87 లక్షల మొక్కలు, జంతు జాతులున్నాయని శాస్త్ర వేత్తల అంచనా. అందులో ఇప్పటివరకు కేవలం 12లక్షల జాతులను మాత్రమే గుర్తించారు. మానవుడు జీవులలో ఒక భాగం, అందుకే మానవునికి , జీవ వైవిధ్యానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. జీవ జాతులు వాణిజ్యపరంగా, విజ్ఞానపరంగా, వైద్యపరంగా, పారిశ్రామికంగా, ఆహార పరంగా, పర్యాటకానికి ఎంతగానో దోహదపడతాయి. మానవ మనుగడకు జీవ వైవిధ్యం దోహదపడినట్లే జీవ వైవిధ్య సమతుల్యానికి మానవ జీవన విధానం కూడా దోహదం చేస్తుంది. భూగోళంపై గల జీవవైవిధ్యం ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, జీవ జాతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 2010 మే 22న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవానికి నాంది పలికింది. ఈ ఏడాది అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం 'ప్రకృతితో సామరస్యం మరియు స్థిరమైన అభివృద్ధి' అనే ఇది వృత్తంతో నిర్వహించుకోవడం జరుగుతుంది. ఈ నినాదం కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయో డైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ (KMGBF) మరియు 2030 ఎజెండా ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (S–Gs) రెండింటినీ సమగ్ర పద్ధతిలో పరిష్కరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. అంతేకాకుండా ప్రపంచ దేశాలు సకల జీవుల సంరక్షణకు రూపొంచుకొనే ప్రణాళికలలో ప్రతి ఒక్కరు భాగం కావాలని ఈ నినాదం నొక్కి చెబుతుంది.

### సంక్షోభంలో జీవ వైవిధ్యం

పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన సహజ వనరులపై తీవ్రఒత్తిడి పెరుగుతుంది. భూగోళం కాలుష్యానికి గురౌవుతుంది. మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక రకాలుగా ధ్వంసం చేస్తున్నాడు. అడవులు నరకడం, రసాయన ఎరువులను వినియోగం, ఆకాశ హర్మ్యాల నిర్మాణాలు, ఖనిజాల కోసం పర్వతాలు తవ్వడం లాంటి చర్యల ఫలితంగా అసంఖ్యాక జంతు, వృక్షజాతులు అంతరించిపోతున్నాయి. పచ్చిక బయలు, సముద్రతీరాలు, పగడపు దిబ్బలు, చిత్తడి నేలలు అతలాకుతలం అవుతున్నాయి. భూకంపాలు, వరదలు, సునామీలు లాంటి సహజ విపత్తులు జీవ వైవిధ్యానికి పెను సవాలుగా మారాయి. గతేడాది నేపాల్ రాజధాని ఖాట్మండు పట్టణంలో 'జీవ వైవిధ్యం, పర్యావరణ వ్యవస్థ సేవలపై ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్ పాలసీ ఫ్లాట్ ఫామ్(IPBES)' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హిందుకుస్ హిమాలయ పర్వత శ్రేణి గడిచిన వందేళ్లలో 70 శాతం జీవ వైవిద్యాన్ని కోల్పోయిందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.



వాతావరణ మార్పులు, పట్టణీకరణ, మితిమీరిన మానవ కార్యకలాపాలే దీనికి కారణమని పేర్కొన్నారు. మరోవైపు ప్రపంచంలోనీ వలస జాతుల్లో ప్రతి ఐదింటిలో ఒకటి అంతర్ధాన ముప్పును ఎదుర్కొంటున్నాయని, జాతుల సంఖ్య 44 శాతం తగ్గిపోయిందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం మానవ చర్యల వలన వన్యప్రాణుల ఆవాసాలు చెదిరి మానవ సమూహంలోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లో కోతుల బెడద పెరగడం, కొన్ని గ్రామాలలో పులులు సంచరించడమే దీనికి నిదర్శనం. జంతువుల వేట, అక్రమ రవాణ వంటి కార్యకలాపాలతో మనిషికి, జీవులకు మధ్య భౌతిక దూరం తగ్గి, సంఘర్షణ పెరుగుతుంది.

ఫలితంగా వాటికున్న అనేక వ్యాధులు మనుషులకు కూడా సోకుతున్నాయి. గతంలో ఎబోలా, బర్డ్ ఫ్లూ, జికా నుంచీ నేటి కరోనా వరకు వన్యప్రాణుల నుండి మనుషులకు సోకినవే వ్యాధులు. ఇవన్నీ జీవ వైవిధ్య, పర్యావరణ విధ్వంసానికి నిదర్శనమే. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి ఉపద్రవాలు వచ్చే అవకాశం లేకపోతే లేదనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తుంది.

### జీవ వైవిధ్య సంరక్షణకు మైలురాయి

21వ శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం, జీవ జాతుల నష్టం పట్ల తీవ్ర ఆందోళన చెలరేగుతున్నది. ఈ నేపథ్యంలో యు.ఎన్ ఆధ్వర్యంలో 1992లో బ్రెజిల్లో జరిగిన ధరిత్రీ సదస్సు జీవవైవిధ్య పరిరక్షణను నొక్కి చెప్పింది. తదుపరి 'కాప్' సమావేశాల్లో ఆధునిక జీవవైవిధ్య సవాళ్లను అధిగమించే దిశగా చర్చలు జరిగాయి. డిసెంబర్ 2022లో జరిగిన బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ (COP15) చైనా, కెనడా దేశాల్లో ఉమ్మడిగా జరిగింది. ఇందులో 2030 నాటికి జీవ వైవిధ్య నష్టాన్ని అరికట్టి, పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణకు 'కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్' ను ప్రపంచ దేశాలు అమోదించాయి. ఇది గొప్ప మైలురాయిగా పేర్కొనవచ్చు. ఈ ఫ్రేమ్ వర్క్‌ను భారతదేశంలోనీ తెలంగాణ రాష్ట్రం మొదటగా ఆమోదించడం అభినందనీయం. భారత దేశం అనాదిగా జీవ వైవిధ్యానికి అనుకులతను కలిగివున్నది. ప్రపంచంలో అతిపెద్ద జీవ వైవిధ్య దేశాలలో భారత్ ఒకటి. నాలుగు జీవ వైవిధ్య ప్రజ్వలన కేంద్రాలు(hotspot) ఇక్కడ ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి ఒప్పందాలకనుగుణంగా భారత్ కూడా అంతరించిపోయే అరుదైన జాతుల సం రక్షణకు పలు చర్యలు చేపడుతుంది. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం1972 తీసుకు రావ డం జరిగింది. జంతువుల సంరక్షణకు వివిధ ప్రాజెక్టులు మరియు వాటినీ గణించి పలు చర్యలు చేపడుతుంది. అంతేకాకుండా బయోస్పియర్ రిజర్వ్, జాతీయ పార్కులు, అభయారణ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. గతేడాది గ్రేట్ ఇండియన్ బస్టార్డ్ పక్షుల పరిరక్షణ పై సుప్రీంకోర్టు కమిటీ వేసింది. ఈ విధమైన చర్యలు చేపడుతున్నప్ప టికి గ్రేట్ ఇండియన్ బాస్టర్డ్, రాబందులు, పిచ్చుకలు,కాకులు,బెంగాల్ టైగర్,ఆసియా టిక్ లయన్, రెడ్ పాండా మరియు ఇండియన్ రైనోసర్స్ లాంటి అనేక అరుదైన జాతులు ప్రమాదంలో పడడం ఆందోళన కలిగిస్తుంది. కావున ప్రపంచ దేశాలు చట్ట పరమైన, విధాన పరమైన చర్యలతో జీవ వైవిధ్య సంరక్షణకు మరింత కృషి చేయాలి. ఇప్పటికే వాతావరణ మార్పులతో జీవ జాతులు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమం లో పర్యావరణ హిత చర్యలతో సుస్థిర అభివృద్ధికి తోడ్పడాలి. జీవ వైవిద్యాన్ని జాతీయ సంపదగా భావించాలి. జీవ వైవిధ్య చట్టాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలి.

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428

## విచక్షణ జ్ఞానం

జల ప్రాణులకు ఎవరు చెప్పారు
నీటిలో తప్ప బయట బతకలేమని
బయటకు వస్తే ప్రాణాలే పోతాయి అని.
పక్షులకు ఎవరు చెప్పారు
ఆకాశంలోనే సంచరించాలని
అవసరమైతే తప్ప భూమి పైకి రావద్దని.

అడవి జంతువులకు ఎవరు చెప్పారు
తనకున్న ప్రదేశాన్ని విడిచిపెడితే
కష్టాలకు గురై ఇబ్బంది పడతామని.
క్రూర మృగాలకుఎవరు చెప్పారు
వేటాడుకుని తినడమే ఉత్తమమని
ఒకరికి బానిస కాకుండా ఉండాలని.

మహా పురుషులకు ఎవరు నేర్పారు
ఎంత లోకజ్ఞానం సంపాదించిన
తనదైన ముద్ర తనకు ఉండాలని.
ఎంత నేర్చుకున్నా ,ఎంత సంపాదించిన
ఎంత గొప్ప పదవులను అలంకరించిన
విచక్షణ జ్ఞానం లేకుంటే ఆ జీవితం వ్యర్థం

**- నెరువట్ల చైతన్య**
9491470746

# విద్యార్థిని సంస్కరించే విద్య కావాలి



విద్య యొక్క ముఖ్య లక్ష్యం విద్యార్థులలో సమగ్ర మూర్తిమత్వాన్ని పెంపొందించడం. ప్రతి విద్యార్థిలో అంతర్గతంగా వివిధ రకాల సహజ నైపుణ్యాలు ఉంటాయి. వాటిని వెలికి తీసే లాగా విద్యా వ్యవస్థ ఉండాలి. కానీ నేడు కేవలం విద్య లక్ష్యం ర్యాంకుల సాధన అయింది. కేవలం పాఠ్య పుస్తకాలలోని జ్ఞాన సముపార్జన మాత్రమే చదువు అనే స్థాయికి నేటి విద్యా విధానం వెళ్ళింది.

### విద్యలో కార్పొరేటీకరణ సంస్కృతి

విద్యలో కార్పొరేటీకరణ సంస్కృతి క్రమ క్రమంగా పెరుగుతుంది. విద్యావ్యవస్థతో సంబంధం లేని వారు కూడా విద్యాలయాలను కేవలము ధనార్జనే ధ్యేయంగా స్థాపిస్తున్నారు. డొనేషన్‌లు, మార్కులు, ర్యాంకుల సంస్కృతిలో మన సమాజం కొట్టుకుపోతుంది.

### విద్యా విధానం- గురుశిష్యుల సంబంధం

ప్రాచీన విద్యా విధానంలో ప్రతి విద్యార్థి పైన వ్యక్తిగత శ్రద్ధ ఉండేది. కేవలం విద్య మాత్రమే కాకుండా కష్టసుఖాల గురించి ఆకళింపు చేసుకొనే అవకాశం ప్రాచీన విద్యా విధానంలో ఉండేది. నేడు ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు మధ్య మానసిక అంతరం అంతకంతకు పెరిగిపోతోంది. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రంగాలలో ఆసక్తి కలిగేలా విద్యాబోధన సాధించాల్సిన అవసరం ఉంది.

### పిల్లల విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర

పిల్లల విద్యాభ్యాసంలో తల్లిదండ్రుల పాత్ర కూడా చాలా కీలకమైనది. పిల్లలు ఎలాంటి పాఠ్యాంశాలపైన, సహపాఠ్య కార్యక్రమాల పైన ఆసక్తి చూపుతున్నారో గమనించి ఆయా అంశాల్లోనే వారికి తర్ఫీదు ఇవ్వాలి. చదువులో రాణించే విద్యార్థులను చూపెట్టి వారిని ఆదర్శంగా తీసుకోమని తమ పిల్లలపై ఒత్తిడి పెంచడం అసమంజసమైన విషయం. పిల్లల ఆసక్తికి అనుగుణంగా



వారి మనోభావాలను గుర్తించి చదివించడం తల్లిదండ్రుల బాధ్యత. అప్పుడే పిల్లల మానసిక ఎదుగుదల జరుగుతుంది

### విద్యాభ్యాసంలో ఉపాధ్యాయుల పాత్ర

ఒక విద్యార్థి మేధో సామర్థ్యం ఎక్కువ, మరో విద్యార్థికి తక్కువ ఉన్నప్పుడు ఉపాధ్యాయుడు తక్కువ స్థాయి గ్రహణశక్తి ఉన్న విద్యార్థికి మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. ఉపాధ్యాయుడు పిల్లలు తాము చదువుకోవాల్సిన పాఠ్యాంశాలపై మక్కువ పెంచుకునేలా కృషిచేయాలి. కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదివితే ఫలితాలు ఎక్కువగా ఉంటాయని అవగాహనను కలిగించాలి.

కఠిన పేదరికంతో పుట్టి కష్టపడి చదివిన ప్రపంచ ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, స్వయంకృషితో ఎదిగిన వ్యక్తుల విజయ గాథలు పిల్లలకు తెలియజెప్పాలి. స్ఫూర్తిదాయకమైన ప్రవర్తన ఉండేలాగా పిల్లలని తీర్చిదిద్దాలి. పిల్లల చదువులో ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల సమిష్టి కృషి కూడా అవసరం. అప్పుడే వారు బాధ్యతా యుతమైన భావిభారత పౌరులుగా తయారవుతారు. కేవలం తరగతిగది ప్రపంచంగా భావించే ప్రస్తుత విద్యా విధానాన్ని పూర్తిగా సంస్కరించిన బాధ్యత అందరిపైనా ఉంది. నూతన విద్యా వంతమైన సమాజాన్ని నిర్మించేందుకు, విద్యార్థులు అందరూ ఇష్టపడి చదువుకునేందుకు, తమలోని అంతర్గత సహజ నైపుణ్యాలను వెలికితీసే విద్యావిధానం కొరకు, విద్యార్థి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు, సమాజం ప్రతి ఒక్కరూ భుజం భుజం కలిపి కృషి చేయాలి.

**- పిన్నింటి బాలాజీ రావు**
9866776286

# అగ్గి పిడుగు మన అల్లూరి



విప్లవం పేరు చెబితే వెంటనే ఠక్కున గుర్తొచ్చేది విప్లవ వీరుడు తెలుగు జాతి ముద్దు బిడ్డ. అల్లూరి సీతారామరాజు!! బ్రిటీషర్లను గడగడలా డించి, వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వీరపుత్రుడు. భరతమాత ముద్దు బిడ్డ అల్లూరి సీతారామరాజు. అల్లూరి పేరు చెబితే మన్యం పులకిస్తుంది. గుండె ఉప్పొంగుతుంది. ఆ పేరు మన్యానికి విప్లవ నినాదం. ఉప్పొంగే ఆవేశానికి ప్రతీక. తెల్లదొరల పెత్తనానికి ఉత్పాతం లాంటిది ఆయన పేరు. అడుగు పిడుగై..అగ్గి పిడుగై మాట తూటాగా పేలి..తెల్లవాడి గుండెల్లో నిదురించిన పౌరుషాగ్ని మన అల్లూరి సీతారామరాజు.

అది భరతమాత తెల్లోడి కబంధ హస్తాల్లో నలిగిపోతున్న రోజులు. ఉత్తర భారతంలో స్వతంత్రోద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజులు అలాంటి సమయంలోనే పశ్చిమ గోదావరి జిల్లా అడవుల్లో ఓ అగ్నికణం పుట్టింది.. ఆ అగ్ని కణమే దావాణలంలా వ్యాపించి బ్రిటీష్ సామ్రాజ్య గుండెల్లో వణుకు పుట్టింది.. అలా తెల్లోడి పెత్తనం మీద గర్జించిన తెలుగు తేజమే అల్లూరి సీతారామరాజు.

స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెల్ల దొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ఓ అధ్యాయం. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే అని నమ్మిన అల్లూరి సీతారామరాజు తన పోరాట పటిమతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించారు.

మన్యం ప్రాంతంలో గిరిజనులను సమీకరించి బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి.. కొన్నేళ్లపాటు సమరశీల ఉద్యమాలకు అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించారు.

తెలుగు వీర లేవరా, దీక్షబూని సాగరా... దేశమాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా... అంటూ భరతమాత విముక్తి కోసం బ్రిటీషువారిని గడగడలాడించిన మన్యం వీరుడు మన అల్లూరి సీతారామరాజు.

అల్లూరి ఒక వ్యక్తి కాదు ఆయనో మహోజ్వల శక్తి. ఆయన జీవితం విప్లవానికి ఒక సంకేతం.

స్వతంత్రం సాధించటానికి ఆయుధాలతో సుశిక్షుతులైన సైనికులు కాదు. అది సాధించాలన్న కాంక్ష చాలని నిరూపించిన అసలు సిసలు భారతీయుడు. అందుకే లోకజ్ఞానం లేని అడవి బిడ్డలనే ఆయుధాలుగా మార్చి తెల్లదొరలు గుండెలు చీల్చాడు..

సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు.

అడవి బిడ్డలైన గిరిజనులను ఏకంచేసి... ఆ ప్రకృతి సంపదలను అనుభవించే హక్కు గిరిజనులదేనని ఎలుగెత్తి చాటాడు. ఈయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. పోడు వ్యవసాయానికి పన్ను కట్టక్కర లేదన్నాడు, గిరిజనులను నిలువు దోపిడీ చేస్తున్న దళారుల మీద, వారికి అండదండలుగా ఉన్న బ్రిటీషువారిమీద అల్లూరి తన విల్లును ఎక్కుపెట్టాడు. ప్రతీ గిరిజనున్ని ఒక గెరిల్లా యోధునిగా మార్చి తెలుగు నేలకు స్వతంత్ర పోరాట మార్గం చూపాడు.

సమాచారం ఇచ్చి మరీ పోలీసుస్టేషనులపై దాడుల నిర్వహించి బ్రిటీషు అధికారుల్లో ముచ్చెమటలు పట్టించాడు. అయితే అదే ఏడాది అల్లూరి సీతారామరాజు విప్లవదళానికి మొదటి ఎదురుదెబ్బ తగిలింది. 1922 డిసెంబరు 6న జరిగిన పోరులో 12 మంది అనుచరులను రామరాజు కోల్పోయాడు.ఆ తర్వాత రామరాజు కొన్నాళ్లు ఎలాంటి పోరాటాలు జరుపలేదు ఆ సమయంలో ఆయన మరణించాడనే పుకార్లు కూడా వ్యాపించాయి.

అయితే అల్లూరి 1923 సంవత్సరం ఏప్రిల్ నెలలో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. మరోసారి దాడులకు దిగాడు.

కాని అల్లూరికి సాయం చేస్తున్నారన్న నేపంలో బ్రిటీస్ అధికారులు మన్యం ప్రజలను వేధిచటం మొదలు పెట్టారు.. తనకున్న అవకాశాలతో పూర్తి స్థాయిలో మన్యం వీరులకు రక్షణ కల్పించలేని రామరాజు లొంగిపోవాలనుకున్నాడు.. అలా అయిన మన్యం ప్రజలకు వేదింపులు తగ్గుతాయని భావించాడు.

తాను స్నానానికి చేరువు దగ్గరకు రాబోతున్నట్టుగా తన అనుచరుల ద్వారా బ్రిటీష్ అధికారులకు సమాచారం అదించాడు రామరాజు.

1923 మే 7న ఏటి ఒడ్డున స్నానం చేస్తుండగా ఆయనను బంధించిన పోలీసులు ఎటువంటి విచారణ చేపట్టకుండానే అదే రోజున కాల్చిచంపారు. ఆయుదం చేతిలో లేని అల్లూరిని బ్రిటీష్ పోలీసులు ఆయన చెట్టు కట్టేసి కాల్చి కసి తీర్చుకున్నారు. కాని బ్రిటీష్ అధికారులు ఓ నాయకున్ని చంపగలిగారు కాని ఆయన ప్రజల్లో రగిలించిన.. స్వతంత్ర ఆకాంక్షను మాత్రం ఆర్పేయ లేకపోయారు.. తెలుగుతేజం అల్లూరి మరణం లేని విప్లవ వీరుడు.. తెలుగు జాతికి, దేశానికి స్ఫూర్తి ప్రధాత.

అడవి బిడ్డలకు ఆరాధ్య దైవం. సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి. సంగ్రామ భేరి. స్వాతంత్ర్య నినాదం. సమరగీతం.. ఉద్యమ జ్వాల. తెలుగు నేల మీద కూడా



స్వతంత్ర సమరానికి బీజాలు వేసిన మహానాయకుడు అల్లూరి జయంతి సందర్భంగా ఒక్కసారి ఆ మహానాయకుని మరోసారి ఘన నివాళి అర్పిద్దాం

**- అనంతాత్మకుల కొండబాబు**

# భారత్, 'ఘన' సహకారం

భారత ప్రధాని మోదీ జులై 2 నుంచి జులై 9 వరకు ఐదు దేశాల పర్యటనలో ఉన్నారు. ముందుగా ఘన దేశానికి చేరుకున్నారు. ఇక్కడ ఘన దేశం గురించి టూకిగా ఘన దేశం పశ్చిమ ఆఫ్రికాలో ఉన్న దేశం. ఈ దేశం పూర్వం బ్రిటీష్ గోల్ కోస్ట్, టొగొలాండ్‌లతో ఉన్న దేశం. 1957 మార్చి 6 వ తేదీన బ్రిటీష్ హస్తాల నుంచి స్వేచ్ఛ పొందింది. 1960 జులై 1న కామన్ వెల్త్ లో ఘన దేశం స్వతంత్ర గణ తంత్ర రాజ్యాంగ ఉంది. ఘన దేశపు రాజధాని అక్రా. కరెన్సీ సిడి. మాట్లాడే భాషలు ఆంగ్లం, ట్వీ, సాంటి, గా, ఈవ్, దగ్బానీ భాషలు మాట్లాడుతారు. మతం క్రైస్తవం, ఇస్లాం. భారత్‌లో మాదిరి ప్రధానంగా వ్యవసాయక దేశం.'కొకొ'ప్రధాన పంట. ప్రధాన ఎగుమతులు కలప,బంగారం,మాంగనీసు. దిగుమతులలో ఆహార పదార్థాలు, వస్త్రాలు, యంత్ర సామగ్రి, వినియోగ వస్తువులు మొదలైనవి. గత మూడు ముప్పైసంవత్సరాల కాలంలో ఘన ను సందర్శించిన మొదటి ప్రధాని మోదీ. ఘన దేశ అధ్యక్షుడు మహమా మోడీకి స్వాగతం పలికారు. మోదీకి, ఘన దేశపు అత్యున్నత అవార్డు అయిన 'ఆర్డర్ ఆఫ్ దిస్టార్ ఆఫ్ ఘన' పురస్కారంతో సత్కరించారు.ఈ అవార్డు 140 మంది భారతీయులకు అంకితం అంటూ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆ దేశ పార్లమెంటు సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ 'భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది' అని చెబుతూ మా దేశంలో దాదాపు చిన్నా, చితుక పార్టీలు రెండు వేల ఐదు వందలు ఉన్నాయాన గానే అక్కడి సభ్యులు అచ్చెరువొందారు. ఇరవై రెండు భాషలు ఉన్నాయి. 29 రాష్టాలలో వేరు వేరు పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. ఇంకా వేలాది మాండలికాలు ఉన్నాయి. అంత వరకు మోదీ ప్రసంగాన్ని విన్న ఘన పార్లమెంటు సభ్యులు 2,500 పార్టీలు ఉన్నాయంటే ఆశ్చర్య పోతున్నారు. మీరు భారత ప్రధానిగా ఉండటం మాకు ఆనందం అన్నారు. మహమా మాట్లాడుతూ ఒక అతి పెద్ద ప్రజాస్వామ్యం దేశం నేతతో ఖనిజాలు, రక్షణ, ఎనర్జీ, సముద్ర భద్రత వీటి విషయంలో కలసి పని చేస్తాం అన్నారు. భారత్, ఘన దేశాలు స్నేహం కొసం కృషి చేస్తూ, సంస్కృతి సంబంధాలు మెరుగు పరచుకుంటాయి. అనేకనేక విషయాలలో తగిన భాగస్వామ్యం ఏర్పరచుకుని



ముందుకు సాగుతామని మహమా, మోదీ చెప్పడం గమనార్హం.

ఘనతో మా మైత్రి విడిపోదు అన్నప్పుడు మహమా మోదీని అభినందించాడు. ఘన దేశపు సంస్కృతితో భారత సంస్కృతి ముడి పడి ఉన్నాయి అని, ఘన దేశపు సంస్కృతిని గౌరవించారు. అక్కడ ఉన్న ప్రవాస భారతీయులతో మమేకం అయ్యారు. ఘన దేశం నుంచి మోదీ, ట్రిని డాడ్ అండ్ టొబాగ్ ప్రధాని కమ్లా పెర్సాద్ బిసెర్‌తో కలసి ముప్పై ఎనిమిది మంత్రులు అపురూప స్వాగతం పలికారు. మోదీ ఆ దేశపు ప్రధానికి మహ కుంబ్, సరయు నది పవిత్ర జలాలు ఆమెకు అందించారు. వీటితో పాటు రామ మందిర ప్రతిమ ను కూడా బహుమతిగా ఇచ్చారు. అక్కడి వారితో మా భారత్ లో ప్రయాగ్ రాజ్ లో మహ కుంబ్ జరిగింది. వేలాది మంది పాల్గొన్నారు అని మహ కుంబ్ వివరాలు తెలియజేశారు. దీనికి ఆ దేశ ప్రధాని మాట్లాడుతూ మోదీ వంటి ఉత్తమోత్తమ ప్రధాని భారత్‌కు ఉండటం గర్వకారణం, మాకు ఆనందాన్ని ఇచ్చింది అని కితాబు ఇచ్చింది. అన్నీ రంగాలలో భారత్ తో కలసి నడుస్తామని చెప్పడం, భారత్ సహకారం మాకు అవసరం అని పేర్కొన్నారు. అక్కడ నుంచి మోదీ అర్జెంటైనాకు వెళతారు. మరియు బ్రెజిల్, నమీబియా దేశాలను కూడా సందర్శిస్తారు.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# అధికారమైనా, ప్రతిపక్షమైనా వంగవీటి అడుగుజాడల్లోనే...

● ఎమ్మెల్యే బొండా ఉమ



**విజయవాడ సెంట్రల్, జూలై 04 (మనం న్యూస్):** సెంట్రల్ నియోజకవర్గం లోని 23వ డివిజన్ బీసెంట్ రోడ్ లో ఒగ్గ గణేష్, క్రాంతి ఆధ్వర్యంలో దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగారావు 78వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరయి వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. 100 మంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా, ఉదయం నుండి సెంట్రల్ నియోజకవర్గంలోని వాడ వాడలా ఘనంగా నిర్వహించి సేవా కార్యక్రమాల ద్వారా అన్నదానాలు, రక్తదానాలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహానుభావులు వంగవీటి మోహన రంగా పేద వర్గాల కోసం పోరాడి అసువులు బాసారని, ప్రతి సంవత్సరం ఈ రోజున వారిని స్మరించుకుంటూ పలు సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషించి దగ్గ అంశమని అన్నారు. 1980 దశకంలో అప్పుడే మహానగరంగా విస్తరిస్తున్న విజయవాడలో చుట్టుపక్కల ప్రాంతాల నుండి వలస వచ్చిన పేద ప్రజలకు వంగవీటి మోహన రంగా అండగా నిలబడి, వారికి కష్టం తెలియకుండా చూసుకున్నారని అన్నారు. కులాలకు అతీతంగా పేదవారిని అక్కున చేర్చుకున్న మహానాయకుడు వంగవీటి మోహన రంగా అని తెలిపారు. ఆనాడు ఆయన చేసినటువంటి ప్రతి ఉద్యమంలో ఆయనతో పాటు నడిచినటువంటి తాను అనుభవాలను స్మరించుకుంటూ, ఆయన నడిచిన నేలమీద తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలవడం అదృష్టంగా బావిస్తున్నానని అన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే తన మీద మాచర్లలో దాడి జరగినా, ఆ మహానుభావులు వంగవీటి మోహనరంగా ఇచ్చిన ధైర్యమే తనను ముందుకు నడిపిస్తుందన్నారు. వంగవీటి మోహన రంగా ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, లీలా, శంకర్, వంగవీటి మోహన రంగా గారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ పశ్చిమ బైపాస్ జాతీయ రహదారికి వంగవీటి మోహన రంగా పేరు పెట్టాలి

● ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి



**విజయవాడ పశ్చిమ, జూలై 04 (మనం న్యూస్)** విజయవాడ పశ్చిమ జాతీయ రహదారికి వంగవీటి మోహన రంగా పేరు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిళ రెడ్డి డిమాండ్ చేశారు. పేదల పక్షపాతిగా, పేదల అభ్యున్నతి ధ్యేయంగా, తుది శ్వాస వరకు పేదల పక్షాన పోరాటం చేసిన గొప్ప నేత వంగవీటి మోహన రంగా అని ఆమె కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా పేరును ఆయన జ్ఞాపకార్థంగా విజయవాడ పశ్చిమ జాతీయ రహదారికి వంగవీటి మోహన రంగా జాతీయ రహదారిగా నామకరణం చేయాలని ఆమె కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రతిపాధనను గతంలోనే కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందని గుర్తు చేశారు. వంగవీటి మోహన రంగా 78వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. అయితే విజయవాడతో పెనువేసుకున్న వంగవీటి రంగా అనుభందం విడదీయలేనిది అని అన్నారు. ఆయన పేరును కనీసం జాతీయ రహదారికైనా పెడితే అదే మనం ఆ మహనీయుడికి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రంగా జయంతి సందర్భంగా మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి గుర్తు చేస్తున్నామన్నారు. కాజ టోల్ గేట్ నుంచి చిన్న అవుటుపల్లి పల్లి వరకు 47.8 కి.మీ ఉన్న జాతీయ రహదారికి వంగవీటి మోహన రంగా జాతీయ రహదారిగా నామకరణం చేయాలని సూచించారు.

## అల్లూరి, పింగళి, వివేకానందలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి



**విజయవాడ సెంట్రల్, జూలై 04 (మనం న్యూస్):** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి, పింగళి వెంకయ్య, స్వామి వివేకానంద ల వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, పింగళి వెంకయ్య జీవిత చరిత్ర, స్వామి వివేకానంద జీవిత చరిత్రలను వివరించారు. అనంతరం అల్లూరి సీతారామ రాజు, పింగళి వెంకయ్య, స్వామి వివేకానంద ల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

# సంక్షేమం, అభివృద్ధి ఒకేసారి చేయగల నేత చంద్రబాబు

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ తూర్పు, జూలై 04 (మనం న్యూస్)** వైసిపి పాలనలో రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, కేవలం ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందటంతో పాటు , అభివృద్ధి కార్యకొ్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మూడో రోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ తూర్పు నియోజకవర్గం 17 డివిజన్ రాణిగారితోటలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తోపాటు స్థానిక నేతలతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వారి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించేలా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారన్నారు. ఐదేళ్ల వైసిపి విధ్వంస పాలన నుండి కూటమి ప్రభుత్వం వచ్చాక వికాసం వైపు ఏపీ పయనిస్తుందన్నారు. ఈ ఏడాదిగా రాష్ట్రంలో చేసిన మేలు, చేయబోయే పనులు ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతి నెల మొదటి తారీఖు నాలుగు వేల రూపాయాలు పెన్షన్ పేద ప్రజలకు క్రమం తప్పకుండా అందిస్తున్నారు. ఒకవేళ ఒకటో తేదీ ఆదివారం వస్తే...ముందురోజే పెన్షన్ పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పెన్షన్ తో పాటు అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు అంటూ కొనియాడారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లలా సమర్థవంతంగా తీసుకువెళ్లి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ అధ్యక్షుడు రాయి రంగమ్మ , 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు , కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్ , చెన్నుపాటి ఉషారాణి , శాలివాహన కుమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పెరేపి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికులకు ఆల్టిమేటం

● జీతాల పెంపుకు నాలుగు రోజుల గడువు విదించిన కార్మిక సంఘాలు



**విజయవాడ సెంట్రల్ , జూలై 04 (మనం న్యూస్):** శుక్రవారం నాడు విజయవాడ గంధీ నగర్ లోని ధర్నా చౌక్ లో మున్సిపల్ కార్మికుల అధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నాలుగైదు రోజుల్లో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపుదల జరగక పోతే మున్సిపల్ కార్మికుల నిరసన ఉదృతం చేస్తామని కార్మిక సంఘాలు ప్రభుత్వానికి ఆల్టిమేటం జారీ చేశాయి. కేటగిరీల నిర్ణయం లో జరిగిన పొరపాట్లను సరిదిద్దడం, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఈ నెల 12వ తేదీ అర్ధ రాత్రి నుండి సమ్మెకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. మహాధర్నాలో చేసిన తీర్మానాల ప్రకారం ఈ నెల 5 నుండి అన్ని మున్సిపల్ పట్టణాల్లో టెంట్లు వేయడం, 7న మానవహారాలు 8న అర్ధ నగ్న ప్రదర్శనలు, మహిళలు పనిముట్లతో ర్యాలీలో పాల్గొనడం. 9న మోడీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులు అందరూ పాల్గొనడం. 10న రౌండ్ టేబుల్ సమావేశాలు, 11న మోటర్ బైక్ ర్యాలీలు నిర్వహించాలని మహాధర్నాలో కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

## దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసిన భాజపా నాయకులు



**విజయవాడ పశ్చిమ, జూలై 4 (మనం న్యూస్):** బెజవాడ ఇంద్రకీలాద్రిపైన వేంచేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి అత్యంత భక్తి శ్రద్ధలతో ఆషాడ మాసంలో సారె సమర్పించడం తమకు ఆనవాయితీగా వస్తోందని భారతీయ జనతా పార్టీ మహిళా నాయకురాలు బొడ్డు నాగలక్ష్మి చెప్పారు. శుక్రవారం ఉదయం కేదారేశ్వరపేట నుంచి అమ్మవారికి సారె సమర్పణకు 75 మంది భక్త బృందంతో తరలి వచ్చారు. దుర్గాభవాని 75 మందితో అమ్మవారికి అన్ని రకాల పండ్లు, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పుష్పాలు సమర్పించడం జరిగిందన్నారు. దుర్గాభవాని గ్రూప్ మానస భారతీయ జనతా పార్టీ జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు బొడ్డు నాగలక్ష్మి, సుజాత, మాధవి, శ్రీలక్ష్మి, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# నగర వైభవాన్ని చాటిచెప్పేలా విజయవాడ ఉత్సవ్

● దసరా ఉత్సవాల సమయంలో నిర్వహించేందుకు కసరత్తు

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ సెంట్రల్, జూలై 04 (మనం న్యూస్)** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఏటా శరన్నవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతాయని, దసరా ఉత్సవాల సమయంలో విజయవాడ నగర వైభవాన్ని చాటిచెప్పేలా విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక, కళా వారసత్వాన్ని ప్రతిబింబించేలా విజయవాడ ఉత్సవ్ ఆలోచనకు కార్యరూపమిచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో విజయవాడ ఉత్సవ్పై జరిగిన ప్రాథమిక సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొని ఉత్సవ నిర్వహణకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక వారసత్వ సంపదకు వన్నె తెచ్చేలా, పర్యాటకాన్ని ప్రోత్సహించేలా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. విజ్ఞానం, వినోదాన్ని మేళవించి ఏయే కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందనే దానిపై అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి మన రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు విజయవాడ నగర పర్యటన మధురానుభూతులు మిగిల్చేలా కార్యక్రమాలు నిర్వహించాలని చూస్తున్నట్లు తెలిపారు. హరిత బెరం పార్కు, పున్నమి ఘాట్, భవానీ ఐలాండ్, పవిత్ర సంగమం, తుమ్మలపల్లి కళాక్షేత్రం తదితర ప్రాంతాల్లో వైవిధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జానపద కళలను ప్రోత్సహించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఫుడ్ ఫెస్టు, వాటర్ స్పోర్ట్స్, డ్రోన్ షో, లేజర్ షో, థీమ్ బ్యూటిఫికేషన్ వంటివాటిపై దృష్టిసారిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఎగ్జిబిషన్ సొసైటీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా మెగా ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అందరి సలహాలు సూచనలను పరిగణనలోకి తీసుకొని విజయవాడ ఫెస్ట్ నిర్వహణకు ముందుకెళ్తామని ఎంపీ చిన్ని తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రిపై దాడి చేసిన కొడుకును మందలించిన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, జూలై 4(మనం న్యూస్):** వృద్ధాప్యంలో తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న కొడుకు దాడి చేశాడంటూ ఓ వృద్ధ తండ్రి మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించాడు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ సంభందిత తహసీల్దారును, కుమారుడుని పిలిపించి కొడుకును మందలించి, తండ్రిపైన మరో సారి దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించి తండ్రిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దారుకు అప్పగించారు కృష్ణా జిల్లా కలెక్టర్ డికె.బాలాజి. వివరాల్లోకి వెళితే నందివాడ మండలం పుట్టగుంట గ్రామానికి చెందిన వృద్ధులు గొన్నూరు సత్యనారాయణ రెడ్డి తన దివ్యాంగురాలైన కుమార్తె ఝాన్సీ లక్ష్మి సహాయంతో శుక్రవారం మధ్యాహ్నం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మీకోసం సమావేశ మందిరం వద్ద కలుసుకొని తనపై తన కుమారుడు కాశి విశ్వనాథ వరప్రసాద్ రెడ్డి దాడి చేశారని, తనను ఇంటి నుంచి గెంటేశాడని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నందివాడ మండల తహసిల్దార్ గురుమూర్తిని, బాధిత సత్యనారాయణ రెడ్డి కుమారుడు విశ్వనాధ వరప్రసాద్ రెడ్డిని కూడా మచిలీపట్నం కలెక్టరేట్ కు పిలిపించారు. భవిష్యత్తులో అతను తన తండ్రి పై మరల దాడి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరించారు. అంతేకాకుండా అతని తండ్రి సంరక్షణ బాధ్యత అతనిదేనని, ఆయన బాగోగులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. బాధిత వృద్ధునిపై ప్రత్యేక దృష్టి సారించి మరలా అలాంటివి జరగకుండా చూడాలని సంబంధిత తహసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు.

## జగన్మాతకు నృత్య కళార్చన





**విజయవాడ పశ్చిమ, జూలై 04 (మనం న్యూస్):** సనాతన ధర్మ ప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు గానూ సకల కళలకు ఆరాధ్యదేవతయైన ఆది పరాశక్తి, జగన్మాత కనకదుర్గమ్మ సన్నిధిలో నూతన రాజగోపురం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 6.30 నుండి కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. విజయనగరం కు చెందిన నాట్య తరంగిణి విద్యార్థులు భక్తి శ్రద్దలతో కనకదుర్గ అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్యణి ఎ. విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు తమ ప్రదర్శనలో భాగంగా పలు భక్తి కీర్తనలకు 40 మంది లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శన అనంతరం కళా బృందానికి కనకదుర్గమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

# టీఐ విద్యార్థులకు నైపుణ్యంగల శిక్షణ అందించండి

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ తూర్పు, జూలై 04 (మనం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన జిల్లాల్లో ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని.. ఐటీఐ ఉద్యోగులు, సిబ్బంది సమర్ధవంతమైన సేవలందించడం ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డి ఎల్ టి సి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం నగరంలోని గురునానక్ కాలనీలో గల శుభలగ్న వేదిక ఫంక్షన్ హాల్ లో సంఘ అధ్యక్షులు పుట్టగుంట రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 84 ఐటీఐ, డీఎల్టీసీలలో వేలాది మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. 700 మందికిపైగా అధ్యాపకులు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఐటీఐ కళాశాలల్లో శిక్షణ పొందిన ప్రతి విద్యార్థి ఉద్యోగావకాశం పొందేలా నైపుణ్యంగల శిక్షణను అందించాల్సిన అవసరముందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక పరిశ్రమలను ప్రోత్సహించనున్న నేపథ్యంలో ఉద్యోగావకాశాలు మెండుగా లభించే అవకాశముందన్నారు. విద్యార్థులకు సాంకేతిక, పారిశ్రామిక శిక్షణ అందించడంలో కళాశాలల మధ్య పోటీతత్వం పెరగాలని, అప్పుడే నైపుణ్యవంతులైన విద్యార్థులను జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అందించగలుగుతామన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగుల మధ్య స్నేహపూర్వకమయిన వాతావరణం నెలకొందని..ఈ పరిస్థితుల్లో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారికి అన్ని విధాలా న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు దృష్ట్యా కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని.. దశల వారీగా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తోందన్నారు. ఐటీఐ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి తిరువూరులో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీ శివనాథ్ తెలిపారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యారంగంలో ఐటీఐలకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని.. వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక, పారిశ్రామిక శిక్షణను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయడం జరిగిందన్నారు.




ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎన్జీవో అసోసియేషన్ అడుగులు ముందుకు వేస్తోందన్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నూతన ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వడం జరిగిందని.. ఉద్యోగుల మనోభావాలు, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టేలా తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం జరిగిందన్నారు. అనంతరం ఇటీవల జేఏసీ ఛైర్మన్గా ఎన్నికైన ఎ.విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్గా ఎన్నికైన డీవీ రమణలను పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఘనంగా సత్కరించారు.



## కృష్ణాజిల్లా ముద్దుబిడ్డ, తెలుగుజాతి ఆణిముత్యం పింగళి వెంకయ్య

● పింగళి వెంకయ్య 63వ వర్ధంతి సభలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ.

**మచిలీపట్నం, జూలై 04 (మనం న్యూస్):** జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 63వ వర్ధంతిని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఘనంగా నిర్వహించారు. చిలకలపూడి పోలీస్ స్టేషన్ ప్రక్కన ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య విగ్రహనికి డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో పుట్టిన పింగళి వెంకయ్య దేశ స్వాతంత్ర సంగ్రామంలో ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు మరువ లేనివని కొనియాడారు. జాతిపిత గాంధీ మహాత్ముని ఆదేశాల మేరకు భారతదేశానికి మువ్వన్నెల జెండాను రూపొందించి అందరి మన్ననలను పొందిన తెలుగు వాడు పింగళి వెంకయ్య కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల జాతీయ జెండాల కన్నా భారతదేశ జాతీయ జెండా మిన్న అంటూ ఉత్తమ జాతీయ జెండాగా యునెస్కో ప్రకటించడం తెలుగు వారందరూ హర్షించ దగ్గ విషయమన్నారు. పింగళి వెంకయ్య తెలుగు వారందరికీ ఆదర్శ ప్రాయులని పింగళి వెంకయ్య జీవిత విశేషాలను పాఠ్యాంశాలలో చేర్చి భావి భారత పౌరులకు తెలియ జేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పినిశెట్టి నాగఛాయా దేవి, గడ్డం రాజు, తిరుమలశెట్టి రాజు, ఊచా చంటి, ఎడుంబాకుల వాసు, కూనపురెడ్డి ప్రసాద్, శాయన శివయ్య, ఈవన మణిబాబు, వైసాయి కృష్ణ, పినిశెట్టివేణు, మంత్రి పృద్వి వడ్డీ సాయి, ఉడుముల బుజ్జి, సంకులనాని, ఏరువ శ్రీనివాస్, వడ్డీ చిరంజీవి, తోటరాజేష్, కొల్ల పల్లిగణేశ్, చలమలశెట్టి శ్రీనివాస్, చిల్లంకుర్తి పిచ్చేశ్వరరావు, కొక్కు లక్ష్మణ, చలమలశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులతో ఎంపీ సమావేశం



**విజయవాడ సెంట్రల్, జూలై 04 (మనం న్యూస్):** విజయవాడ కె.ఎస్.ఎన్. మూర్తి భవన్ లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులతో విజయవాడ ఎం.పి కేశినేని శివనాథ్ శుక్రవారం నాడు బేటీ అయ్యారు. అనంతరం వారు వంగవీటి మోహన రంగా విగ్రమానికి పూలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ రైల్వే స్టేషన్ల అభివృద్ధి, శాటిలైట్ స్టేషన్ల అభివృద్ధి గురించి లోక్సభలో ప్రశ్నించినట్లు తెలిపారు. రైల్వే కార్మికుల, సిబ్బంది, రైల్వే కాలనీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ అధికారులను , రైల్వే అధికారులను సమన్వయ పరిచి విజయవాడలో రైల్వే శాఖతో ముడిపడి ఉన్న మురుగునీటి పారుదల సమస్యను త్వరలోనే పరిష్కారిస్తానన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ కేశినేని శివనాథ్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ లీల, హిందూ మజ్దూర్ సభ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి ఎన్ శ్రీనివాస రావు , డివిజనల్ కోశాధికారిణి ఆర్.ఎమ్. లక్ష్మి, మజ్దూర్ యూనియన్ డివిజనల్ అధ్యక్షులు రామ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాడు నీళ్లు వదలాలని కదం తొక్కిన రైతాంగం..

- అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు నీళ్లు విడిచే వరకు వెళ్ళమని బిస్మించి కూర్చున్న రైతాంగం .
- పోలీసుల జోక్యంతో ఇరిగేషన్ అధికారులు రైతుల వద్దకు వచ్చి హామీ.
- ఇరిగేషన్ అధికారుల హామీతో ఆందోళన విరమణ



**జూపాడుబంగ్లా జులై 4(మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు వెంటనే నీళ్లు వదలాలని గత నాలుగు రోజుల నుండి సంబంధిత అధికారులను అడుగుతున్న అధికారులు మరియు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నందువల్ల రైతులందరూ పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తడానికి వెళ్లగా 80 బన్నూరు వద్ద రైతు నాయకులను మరియు రైతులను పోలీసు అధికారులు అడ్డుకోవడంతో సుమారు గంట పాటు రైతులకు పోలీసులకు మధ్య తోపులాట వాగ్వాదం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులను పోలీసులు బలవంతంగా పోలీస్ వాహనాల్లో ఎక్కించగా రైతులు పోలీసు వాహనాలకు అడ్డంగా పండుకొని నిరసన వ్యక్తం చేయడంతో అయితే చేసేదేమీ లేక పోలీసులు ఇరిగేషన్ ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేసి ఇరిగేషన్ అధికారులని రైతుల వద్దకు పిలిపించడం జరిగింది.. రైతుల వద్దకు వచ్చినటువంటి ఇరిగేషన్ ఏఈ గారు సీఈఓ గారితో ఫోన్లో మాట్లాడి వారం రోజుల కల్లా పోతిరెడ్డి పాలధార నీళ్లు ఎత్తుతామని హామీ ఇవ్వగా, అలా ఒప్పుకునే ప్రసక్తి లేదని వెంటనే నీడు విడుదల చేయాలని 854 అడుగులు దాటి 15 రోజులు అవుతున్న నీళ్లు విడుదల చేయకపోవడంతో నంద్యాల జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాలోని అన్ని జిల్లాలకు అన్యాయం జరుగుతుందని రైతులు పోలీస్ అధికారులతో ఇరిగేషన్ అధికారులతో వాగ్వేదం చేశారు. మరో మారు ఇరిగేషన్ అధికారులు ఎస్సీ గారు ప్రభుత్వంతో మాట్లాడి కచ్చితంగా వారం రోజుల లోపే నీళ్లు విడుదల విడుదల చేస్తామని చెప్పగా రైతు సంఘాల నాయకులు ఆరో తేదీ సాయంత్రంలోగా నీళ్లు ఈ విడుదల కార్నిపక్షంలో ఏడో తేదీన జిల్లా వ్యాప్తంగా రైతు సంఘాలు రైతు లందరూ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తారు అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శులు టి. రామచంద్రుడు, టి .వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు, వీరన్న సురేష్ రామకృష్ణ రాముడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు, .ఫకీర్ సాహెబ్, , కర్ణ .శీను. రాము. బాలయ్య,. కెవిపిఎస్ నాయకురాలు రంగమ్మ, ఈశ్వరమ్మ.. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు, సోమన్న , సీడు రైతుల నాయకులు రామ సుబ్బారెడ్డి గారు సిఐటి నాయకులు రణధీర్, రాజు, గోపాలకృష్ణ మరియు జిల్లాలోని రుద్రవరం గోస్పాడు, మహానంది ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లె, బేతంచెర్ల, మిడుతూరు, నంద్యాల , పాణ్యం, నందికొట్కూరు మండలాల రైతులు రైతు సంఘాల నాయకులు యాలూరు రామసుబ్బారెడ్డి సొసైటీ మాజీ డైరెక్టర్. వెంకట స్వామి గౌడ్ రాము.పాల్గొన్నారు ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 854 అడుగులు ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు విడుదల చేయాలని నిబంధనలు ఉన్న, నిబంధనలను తుంగలో తొక్కి ఇరిగేషన్ అధికారులు మరియు నీటిపారుదల శాఖ మంత్రి , రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు వదలకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందువల్ల రైతులే స్వయంగా గేట్లెత్తే కార్యక్రమానికి తరలి వచ్చారని, తమ లోపాన్ని సరిదిద్దుకొని ప్రభుత్వం సాగు నీరు ఇవ్వమని అడగడానికి వచ్చిన రైతుల పైన దౌర్జన్యం చేసి బలవంతంగా పోలీస్ జూపాడు బంగ్లాస్టేషన్లకు తరలించడం చాలా అన్యాయం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాయలసీమ జిల్లాలను సాగునీటి విడుదల విషయంలో, మరియు మద్దతు ధరలకే పంటలు కొనుగోలు చేసే విషయములో, పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని, రాయలసీమ రైతాంగానికి అన్ని విషయాల్లో నష్టం జరుగుతున్న జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎంపీలు గుడ్లప్పగించి చూస్తున్నారే కానీ సకాలంలో స్పందించి సాగునీటి విషయాన్ని మరియు గిట్టుబాటు ధర సమస్యలను పరిష్కరించడం లేదు, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో విడుదల చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఐతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తు ఆందోళన చేస్తాము అందుకు ప్రభుత్వానిదే బాధ్యత అని మాట్లాడారు. అనంతరం పోలీసులు అధికారులు రైతులందరిని బంగ్లా పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి



**కౌతాళం, జులై 04 మనం న్యూస్:** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే మంచి పరిపాలన అందించిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి అన్నారు వారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు సుపరిపాలన లో తొలి అడుగు అను కార్యక్రమంలో మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం, కౌతాళం లో టిడిపి కౌతాళం టౌన్ అధ్యక్షులు కాశి విశ్వనాథ ధని అధ్యక్షతన ఇంటింటికీ తిరిగి సంవత్సరం లో ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పై ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ పెంచి పెద్దన్న గా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అని వారు అన్నారు తల్లికి వందనం,ఈ నేలలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ధని, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బాపురం శివ మోహన్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యనిర్వహణాధికారి కోట్రేష్ గౌడ్,డమ్మలదిన్ని సర్పంచ్ రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు నీలకంఠ రెడ్డి,బిసి సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు,కుంటనహళ్ళు దోడ్డన్న గౌడ్,మైనారిటీ జిల్లా కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్, బిసి సాధికారికంగా సభ్యులు సిద్దు,సోమన్నచౌదరి ,బూతు ఇన్ చార్జి చిరంజీవి,యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి రాజాబాబు,ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు,ఐ టిడిపి నియోజకవర్గ ఉపాధ్యక్షులు మంజునాథ ధని,శివప్ప గౌడ్,ఈరప్ప , నరసింహులు,బావిగడ్డ వెంకటేష్, శ్రీనివాస్,రవి, ఉమేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో మల్లన్న భక్తులకు శుభవార్త



**శ్రీశైలం, జూలై 4(మనంన్యూస్):** శ్రీశైల మల్లన్నను ఉచితంగా స్పర్శ దర్శనం చేసుకునే భాగ్యాన్ని సామాన్య భక్తులకు కల్పిస్తూ ఒక్కరోజు ముందు మాత్రమే ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు అన్నారు. భక్తుల కోరిక మేరకు ప్రతి మంగళవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం సమయంలో ఉచిత క్యూలైన్ ద్వార భక్తులను స్వామివారి గర్భాలయ స్పర్శ దర్శనం చెయించేందుకు పూర్తిఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఆలయ ప్రధాన విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఆసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకొవాలని ఈవో సూచించారు. అదే విధంగా భక్తులు తమ ఆధార్ ద్వార దేవస్థానం అధికారిక వెబ్సైట్ లలో మాత్రమే నమోదు చేసుకుని ఉచిత స్పర్శ దర్శనం టిక్కెట్లు పొందవచ్చునని ఈవో తెలిపారు. రోజుకుకేవలం 1000 మంది మాత్రమే ఉచిత దర్శనం చేసుకునే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. దేవస్థానం అధికారులు సిబ్బందితో యాత్రికులు సహకరించాలని ఈవో కోరారు.

**దళారులను నమ్మవద్దు – ఈవో**

మల్లన్నను స్పర్శ దర్శనం చేసుకునేందుకు ఉచితంగా టికెట్లు పొందుటకు యాత్రికులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. అదే విధంగా దేవస్థానం నిభందనలను ఉల్లంఘించే నకిలీ టికెట్లనువిక్రయించేందుకు యత్నించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



**తుగ్గలి జులై 4(మనం న్యూస్ ):** గ్రామాలలో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని జొన్నగిరి సబ్ ఇన్స్పెక్టర్ యన్ సి.మల్లికార్జున సూచించారు.జిల్లా సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పటేల్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం తుగ్గలి మండల జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి మల్లికార్జున పర్యటించి, పీర్లచావిడి వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మల్లికార్జున మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో మొహర్రం వేడుకలను నిర్వహించుకోవాలని, చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారినైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు విధ్వంసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రపంచ పోలీస్ క్రీడల్లో టీటీడీ సెక్యూరిటీ, విజిలెన్స్ అధికారుల అద్భుత విజయం

- విజేతలను అభినందించిన టీటీడీ చైర్మన్, ఈవో



**తిరుమల,జూలై 04,మనం న్యూస్:** అమెరికాలోని బర్మింగ్హామ్ నగరంలో జరిగిన ప్రపంచ పోలీస్ మరియు ఫైర్ గేమ్స్ - 2025 పోటీల్లో టీటీడీ సెక్యూరిటీ విజిలెన్స్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు అరుదైన క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తూ అద్భుత విజయాలు సాధించి భారతదేశం జాతీయ మువ్వెన్నల పతాకాన్ని రెపరెపలాడించారు. 45 సంవత్సరాల పైబడిన సింగిల్స్ టెన్నిస్ విభాగం పోటీలో టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఎ. సురేంద్ర స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు, 55 సంవత్సరాల పైబడిన సింగిల్స్ టెన్నిస్ విభాగం పోటీలో విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఎన్.టీ.వీ. రామ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీ.ఆర్. నాయుడు, టీటీడీ కార్యనిర్వహణాధికారి జె. శ్యామలరావు విజేతలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల పోలీస్, ఫైర్ విభాగాల నుంచి 9,000 మంది అథ్లెట్లు పాల్గొన్న ఈ ద్వైవార్షిక పోటీల్లో టీటీడీ అధికారుల విజయాలు దేశానికే గర్వకారణమని, టీటీడీకి ఇది ఒక గొప్ప గౌరవంగా నిలిచిందని కొనియాడారు. టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో వీ. వీరబ్రహ్మం, టీటీడీ నిఘా మరియు ముఖ్య భద్రతా అధికారి కే.వీ. మురళీకృష్ణ లు కూడా విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి విజయం టీటీడీ సెక్యూరిటీ, విజిలెన్స్ విభాగం లోని అధికారుల నైపుణ్యాన్ని, నిబద్ధతను చాటిందని, ప్రపంచవ్యాప్తంగా టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం తోడ్పడిందని పేర్కొన్నారు.

# ప్రజలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది

- వీడియో సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**చిత్తూరు,జూలై4,మనం న్యూస్ :** ప్రజలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని.. సమాజంలో అట్టడుగున ఉన్నవారిని అభివృద్ధి చేయడానికి మార్గదర్శులు ముందుకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 అమలపై శుక్రవారం సాయంత్రం అమరావతి నుండి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ వీడియో సమావేశానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చిత్తూరు నగరపాలక సంస్థ నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సమాజంలోని టాప్ టెన్ లో ఉన్న మార్గదర్శులు.. బాటమ్ లో ఉన్న 20 బంగారు కుటుంబాలను అన్ని రకాలుగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంపై అధికారులు పక్కాగా యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## జాతీయం- అంతర్జాతీయం

## ‘రోజూ రూ.1.25లక్షల ఆదాయం’
### ఆ వీడియో నిజం కాదు: కేంద్రం క్లారిటీ




**ఢిల్లీ, జూలై 4:** ఇన్వెస్ట్మెంట్ స్కీమ్ల పేరుతో సైబర్ మాయగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. అచ్చంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్నట్లుగా డీప్ఫేక్ వీడియోలను సృష్టించి అమాయకులను దోచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. సదరు వీడియో కింద ఇచ్చిన లింక్పై క్లిక్ చేయాలని పేర్కొంటూ మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో ఈ తరహా వీడియోలపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేవలం రూ.21 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజూ రూ.1.25 లక్షల ఆదాయం పొందేలా ఓ ఇన్వెస్ట్మెంట్ స్కీమ్ను ప్రధాని మోడీ ప్రమోట్ చేస్తున్నట్లుగా ప్రసారం అవుతున్న వీడియోలు నకిలీవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్చెక్ విభాగం ‘ఎక్స్’లో పోస్టు పెట్టింది. ఈ వీడియోలు డిజిటల్గా మానిప్యులేట్ చేసినవని పీఐబీ స్పష్టం చేసింది. ఇలాంటి పెట్టుబడి స్కీమ్ ఏదీ ప్రధాని నరేంద్ర మోడీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ప్రవేశపెట్టలేదని తెలిపింది. ఏ వేదికతోనూ వారికి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ తరహా డీప్ఫేక్ వీడియోల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురికావొద్దని విజ్ఞప్తి చేసింది.

# చైనాలో మూడో సంతానానికి రూ.12లక్షలు!

**బీజింగ్, జూలై 4:** జనాభా సంక్షోభాన్ని అధిగమించేందుకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్న చైనా మరో భారీ నగదు ప్రోత్సాహక కార్యక్రమాన్ని త్వరలో అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి పుట్టిన ఒక్కో బిడ్డకు ఏడాదికి రూ.42 వేలు ఇవ్వాలని, చిన్నారికి మూడేళ్లు వచ్చేవరకు దీన్ని కొనసాగించే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే, చైనాలోని హోహోట్, టియాన్మెన్ వంటి నగరాల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ సంతానం ఉన్న కుటుంబాలకు రూ.లక్షల నగదు, ఇతర ప్రోత్సాహకాలు అందించే పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. ఒకే బిడ్డ విధానాన్ని అనేక దశాబ్దాల పాటు అమలు చేసిన చైనా.. 2016 జనవరి 1తో దానికి స్వస్తి పలికింది. అయినప్పటికీ పిల్లల్ని కనేందుకు చైనీయులు ముందుకు రావడం లేదట. దీంతో అక్కడ సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గుతోంది. వివాహాల రేట్లు కూడా రికార్డు స్థాయిలో పడిపోవడంతో రానున్న రోజుల్లోనూ జనాభా సంఖ్య పెరగడం కష్టంగానే కనిపిస్తోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న చైనా ప్రభుత్వం ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు అనేక చర్యలు చేపడుతోంది.

**మూడో బిడ్డకు రూ.12 లక్షలు..**

సంతానోత్పత్తిపై దృష్టిపెట్టిన చైనాలోని పలు స్థానిక ప్రభుత్వాలు.. దంపతులకు నగదు, గృహ వసతి వంటి అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇన్నర్ మంగోలియాలోని హోహోట్ నగరం.. తొలి సంతానానికి 10 వేల యువాన్ల నగదు ఇచ్చే పథకాన్ని అమలు చేస్తోంది. రెండో బిడ్డకు 50 వేల యువాన్లు (ఏడాదికి పదివేల చొప్పున ఐదేళ్లు), మూడో బిడ్డకు లక్ష యువాన్లు (ఏడాదికి పదివేల చొప్పున పదేళ్లు) నగదు అందిస్తోంది. అదనంగా మెడికల్ ఇన్సూరెన్స్, ఫ్రీ హెల్త్ చెకప్తోపాటు ఏడాదిపాటు ఉచితంగా ఓ కప్పు పాలు కూడా అందించే కార్యక్రమాన్ని ఈ ఏడాది మార్చి 1 నుంచి అమలు చేస్తోంది.

**నగదుతోపాటు గృహ సబ్సిడీ..**

సెంట్రల్ చైనాలోని టియాన్మెన్ కూడా ఎక్కువ మంది బిడ్డల్ని కనే దంపతులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. రెండో బిడ్డకు జన్మనిచ్చే తల్లులకు 6500 యువాన్లు అందించడంతోపాటు చిన్నారి మూడేళ్లు వచ్చే వరకు నెలకు 800 యువాన్లను ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అదే మూడో బిడ్డ పుడితే నెలకు వెయ్యి యువాన్లు అందిస్తోంది. వీటితోపాటు గృహవసతి కోసం 18 వేల యువాన్ల సబ్సిడీ, ఉచిత హెల్త్ చెకప్ల వంటి అనేక ప్రయోజనాలను చేకూరుస్తోంది. ఇలా ప్రభుత్వ పథకాల ప్రభావంతో అక్కడ గతేడాదిలో జననాల రేటు 17శాతం పెరిగినట్లు అధికారిక నివేదికలు వెల్లడించాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చాలా ఏళ్లపాటు కొనసాగిన చైనా ఇటీవల రెండో స్థానానికి చేరుకుంది. జనాభా ఏటా క్షీణిస్తుండటమే అందుకు కారణం. జనాభా పెరుగుదలకు అనేక ప్రోత్సాహకాలు అమలు చేస్తున్నప్పటికీ కొన్నేళ్లుగా ఈ సంఖ్య తగ్గుతూనే ఉంది. 2016లో జననాల సంఖ్య 1.8 కోట్లుగా ఉండగా.. గతేడాది ఇది 95 లక్షలకు పడిపోయింది. ఇలాగే కొనసాగితే చైనా జనాభా 2050 నాటికి 130 కోట్లు.. 2100 నాటికి 80 కోట్లకు పడిపోతుందని ఐరాస నివేదికలు అంచనా వేస్తున్నాయి.



## ఆపరేషన్ సిందూర్
# మా నిబద్ధతకు నిదర్శనం

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా



**పుణె, జూలై 4:** దేశ సార్వభౌమాధికార రక్షణకు ప్రభుత్వం, సాయుధ దళాలు ఎంత నిబద్ధతతో ఉన్నాయో చెప్పేందుకు ఆపరేషన్ సిందూర్ అద్భుతమైన ఉదాహరణ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అభివర్ణించారు. పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ ‘‘పీష్వా బాజీరావు స్మారకానికి ఎన్డీఏనే అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడే మన సైనిక నాయకత్వం శిక్షణ పొందుతోంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని తొమ్మిది టెర్రరిస్టు క్యాంపులపై భారత్ విరుచుకుపడి ధ్వంసం చేసింది. అనంతరం ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా పాకిస్థాన్‌లోని కీలక సైనిక స్థావరాలను భారత్ నాశనం చేసిన విషయం తెలిసిందే.

# ఆర్థిక వివరాలిస్తేనే పరిహారమా?

- విమాన ప్రమాద బాధిత కుటుంబాల ఆవేదన..!



**అహ్మదాబాద్, జూలై 4:** గత నెల యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన విమాన దుర్ఘటనలో బాధిత కుటుంబాలకు ఎయిరిండియా తాత్కాలిక పరిహారం అందజేస్తోంది. అయితే, ఈ పరిహారం కోసం ఆర్థిక వివరాలు చెప్పాలంటూ తమను బలవంతపెడుతున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఎయిరిండియా స్పందించింది. అసలేం జరిగిందంటే..? విమాన ప్రమాదంలో పరిహారం అందాలంటే మృతుల కుటుంబాలు కొన్ని ఆర్థిక వివరాలను బహిర్గతం చేయాలంటూ ఎయిరిండియా ఒత్తిడి చేస్తోందని బ్రిటన్‌కు చెందిన న్యాయ సంస్థ స్టీవరట్స్ ఆరోపించింది. ఈ కంపెనీ 40 బాధిత కుటుంబాల తరఫున పరిహార చెల్లింపు ప్రక్రియపై పనిచేస్తోంది. ‘మా క్లయింట్లకు ఎయిరిండియా ఓ ప్రశ్నావళిని పంపించింది. అందులో వ్యక్తిగత వివరాలతో పాటు ఆర్థిక సమాచారానికి సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తిపై దరఖాస్తుదారులు ఆర్థికంగా ఆధారపడి ఉన్నారా? లేదా అని ప్రశ్నించింది. దాన్ని చూసి మేం షాక్ అయ్యాం. దీనిపై అప్పీల్ చేశాం’ అని స్టీవరట్స్ కంపెనీ ఆరోపణలు చేసింది. ఆ వివరాలు ఇవ్వకపోతే చెల్లింపులు రావని ఆ సంస్థ పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వార్తలపై ఎయిరిండియా స్పందిస్తూ ఆరోపణలను ఖండించింది. ‘ఇవన్నీ నిరాధారం, అవాస్తవ కథనాలు. మృతులతో దరఖాస్తుదారులకు ఉన్న బంధాన్ని తెలుసుకునేందుకే మేం ఆ ప్రశ్నావళిని పంపించాం. అప్పుడే తాత్కాలిక చెల్లింపులను సరిగ్గా చేయగలం. ఇలాంటి విషయాల్లో కొన్ని విధి విధానాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇందుకోసం బాధిత కుటుంబాలకు మేం కావాల్సినంత సమయం ఇస్తున్నాం. వారికి అన్నివిధాలా అండగా ఉండాలనే మేం కోరుకుంటున్నాం’ అని ఎయిరిండియా ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటివరకు 47 కుటుంబాలకు తాత్కాలిక చెల్లింపులు చేసినట్లు ఎయిర్‌లైన్ తెలిపింది.జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒక్క ప్రయాణికుడు మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. విమాన ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు కాగా.. 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు టాటాసన్స్ రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించింది. దీంతోపాటు బాధిత కుటుంబాల తక్షణ ఆర్థిక అవసరాలు తీర్చేందుకు వీలుగా రూ.25 లక్షల చొప్పున మధ్యంతర సాయం అందిస్తామని ఎయిరిండియా తెలిపింది.

# శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జూలై 06 నుండి 08 వరకు జ్యేష్ఠాభిషేకం

**తిరుపతి,జూలై 04,మనం న్యూస్:** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జూలై 06వ తేదీ నుండి 08వ తేదీ వరకు మూడు రోజుల పాటు జ్యేష్ఠాభిషేకం జరగనుంది. ప్రతి ఆషాఢ మాసంలో తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొదటి రోజు జూలై 06వ తేదీ ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి కైంకర్యాలు శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపడుతారు. ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సమర్పణ, బ్రహ్మఘోష తదితర కార్యక్రమాలు వేడుకగా జరుగనున్నాయి. జూలై 07వ తేదీ రెండో రోజున ఉదయం సాంప్రదాయబద్ధంగా కైంకర్యాలు జరిగాక శాత్తుమొరాయి, ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం ఉభయ నాంచారులతో స్వామివారు నాలుగు మాడా వీధులలో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. జూలై 08వ తేదీ మూడో రోజున తిరుమంజనం, సమర్పణ, కవచ ప్రతిష్ట తదితర కార్యక్రమాల అనంతరం సాయంత్రం కవచ సమర్పణ చేపడుతారు. సాయంత్రం 5.30 - 6.30 గంటల వరకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారు నాలుగు మాడ వీధులలో విహరిస్తారు.



# తాటిపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు..

- ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే 80% హామీలను నెరవేర్చాము ఎమ్మెల్యే గిత్త జయసూర్య




**జూపాడుబంగ్లా జులై 4 (మనం న్యూస్) :** రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జూపాడు బంగ్లా మండలం తాటిపాడు గ్రామంలో పాల్గొన్న నందికొట్కూరు నియోజకవర్గం శాసనస సభ్యులు, సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించడం జరిగినది, అదేవిధంగా ప్రతి ఇంటిలో ఉన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని సత్వరమే ఆ సమస్యను పరిష్కరిస్తామని వారికి తెలపడం జరిగినది. అనంతరం గ్రామ సచివాలయం నందు ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి త్వరగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగినది. ఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, సూపర్ సిక్స్ కానివ్వండి, బాబు సూరీటి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు కూడా ఏ విధంగా ప్రజలకు అందిస్తామని తెలియపరిచారో అదేవిధంగా ప్రజలకు 80% వరకు హామీలను పూర్తి చేసామని, ఇచ్చిన మాట ప్రకారం 3000 పింఛన్ ను 4000 వేలకు పెంచామని.వికలాంగులకు 6000 రూపాయల పెన్షన్, మంచానికే పరిమితమైన వారికి 15 వేల రూపాయలు, మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కూడా ఆగస్టులో మొదలయ్యే విధంగా చర్య జరుగుతుందని. ముఖ్యంగా తల్లికి వందనం అనేది ఎంతమంది బడికి పోతే అంతమందికి ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు అందించడం జరిగిందని, అయితే ఏదైతే ఆనాడు మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని నెరవేర్చామని, రైతులకు అందించవలసిన అన్నదాత సుఖీభవ గుడక త్వరలోనే రైతుల ఖాతాల్లోకి 20 వేలరూపాయలు రైతుల ఖాతాలలోకి జమ చేయబడతాయని, అయితే గతంలో 2019లో వైసీపీ పాలనలో ఆనాడు ఐదు రూపాయలకే రైతన్నలకు పట్టెడన్నం పెట్టాలని ఉద్దేశంతో ఎన్టీఆర్ క్యాంటీన్లను కూడా బంద్ చేశారు, ఈనాడు మన ప్రభుత్వం వచ్చాక 200 కు పైచిలుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ క్యాంటీన్ ఓపెన్ చేయడం జరిగింది. ఈనాడు ఐదు రూపాయలకే పేదవారికి భోజనం పెట్టే అవకాశం వచ్చిందని, ఆనాటి ప్రభుత్వం దళితులను. విద్యార్థులను మోసం చేశారని బడుగు బలహీన వర్గాల వారిని మోసం చేశారు ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా జగన్మోహన్ రెడ్డి చేసిన అరాచకాలు ఎన్నో ఉన్నాయని, కాబట్టి ఒక్కసారి గ్రామస్థాయిగా ఆలోచించుకోండి మన గ్రామం బాగుండాలి గ్రామంలోని ప్రజలు బాగుండాలి. మూడు కోట్ల పై చిలుకుతో గ్రామంలో సి సి రోడ్లు అయితేనేమి వాటర్ ట్యాంకులు అయితే నేమి ప్రతి ఒక్కటి టిడిపి ప్రభుత్వం తోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, రెడ్డి మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ్ లక్ష్మీ దేవమ్మ, ప్రభాకర్ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసులు గౌడ్, సురేష్, మన్సూర్ భాష, లక్ష్మణ గౌడ్, తర్తూర్ రమణారెడ్డి, తంగడంచ పిక్కిలి శ్రీనివాసులు, తరిగోపుల నారాయణరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు, బూత్ ఇంచార్జ్లు, యూనిట్ ఇన్చార్జులు, కార్యకర్తలు మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు




**బేతంచేర్ల, జూలై 4(మనంన్యూస్) :** పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు పింగళి వెంకయ్య దొడ్డి కొమరయ్యల త్యాగాలను స్మరించుకున్నారు. నెత్తురు మండే యువతకు ఆరాధ్యుడు మన్యం గుండె గుడిలో కొలువైన దేవుడు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని హడలెత్తించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలవమాల వేసి ఘనంగా నిర్వహించారు.అమరత్వంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అగ్గిరాజేసిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలవమాలవేసి నివాళులర్పించారు.మూడు రంగుల జాతీయ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య వర్ధంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్ మధు ఎల్లకృష్ణ లతోపాటుగా ముఖ్య నాయకులు కార్తీక్ సాయి తేజ వెంకటాచారి మున్నా తిరుపాల్ ఖదీర్ శాంతిరాజ్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు




**కర్నూలు జులై 04మనం న్యూస్ :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయంతి వేడుకలు సిఆర్ భవన్ నందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బిసన్న అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెనిన్ బాబు లు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారు భారత దేశ ప్రజలను అనేక చిత్రహింసలకు గురి చేస్తూ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులను బ్రిటిష్ వారు వేసే రోడ్డు పనులలో ఎలాంటి కూలి ఇవ్వకుండానే పనిచేయించుకుంటూ వారిని అనేక చిత్రహింసలకు గురి చేయడమే కాకుండా వారికి జీవితంలో భాగమైన అడవులను వారి నుంచి దూరం చేయడానికి అనేక చట్టాలు తీసుకొస్తూ గిరిజనులను చిత్రహించలకు గురి చేస్తున్న బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గిరిజనులను ఏకతాటిపైకి తెచ్చి వారిలో ఉన్న అనేక వ్యసనాలను మాన్పించి బ్రిటిష్ వారి పైన వీరోచితంగా పోరాడేందుకు వారికి విల్లు విద్యలు, తుపాకీ పేల్చడం లాంటి విద్యలు నేర్పించి మన్యం ప్రజలలో దేశభక్తిని రగిలించి పరిమిత ఆయుధాలతో గెరిల్లా యుద్ధ పద్ధతిలో బ్రిటిష్ పాలకులను గడగడ లాడించి బ్రిటిష్ అధికారులకు చెప్పి మరి వారి పోలీస్ స్టేషన్లో నుండి ఆయుధలను తీసుకుపోయిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని, బ్రిటిష్ దోపిడీ నుండి ప్రజలకు స్వేచ్ఛ కల్పించాలని కాంక్షించి 27 సంవత్సరాల వయసులోనే బ్రిటీష్ ముష్కరుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని అలాంటి వీరుని ఆదర్శంగా తీసుకొని నేడు దేశంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా, సమాజంలో జరుగుతున్న అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని అప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు , నగర నాయకులు శ్రీకాంతు అఖిల్, రవి, ప్రభాకర్ ప్రసాదు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేద్దాం

- జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ బి. నవ్య



**కర్నూలు, జూలై 4 (మనంన్యూస్) :** పోరాట యోధులు స్వాతంత్ర సమరయోధుడు మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్.బి.నవ్య అల్లూరి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు.శుక్రవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు మరియు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ బి. నవ్య మాట్లాడుతూ... అల్లూరి సీతారామరాజు జన్మదినం సందర్భంగా పోరాట యోధుడు , స్వాతంత్ర సమరయోధుడు కి ఘనంగా నివాళులు అర్పించుకోవడం మన బాధ్యత, ఆయన స్ఫూర్తితో మనం దేశభక్తి ని మరింత పెంచుకోవడం మరియు దేశ ప్రజలకు సేవ చేయడం మన కర్తవ్యం అని అన్నారు. ప్రభుత్వ సేవలో మనం ఉన్నాం కావున ఆ మహానుభావుడి స్ఫూర్తితో మనం ప్రజలకు మరింత గా సేవలు చేయాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు గిరిజనుల పట్ల జరుగుతున్న అసమానతలను తెలిపారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సరిచేసే చర్యలు చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీలకు చెందిన సమస్యలను వెరిఫై చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మన జిల్లాలో ఉన్న ట్రైబల్ గ్రామాలకు మౌలిక వసతులు ,కావలసిన త్రాగు నీరు ,రోడ్లు ,కరెంటు మొదలగు సమస్యలను జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేస్తూ ఉండడం జరుగుతుందని ఇంకా మిగిలిపోయినవి ఏవైనా ఉంటే వాటిని కూడా జిల్లా అడ్మినిస్ట్రేషన్ అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చి పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సీఈవో సెట్కూర్ వేణుగోపాల్, డి.అర్.ఓ. వెంకటనారాయణ మ్మ ,సెట్కూర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్, ఇన్చార్జి ట్రైబల్ ఆఫీసర్ ( యస్ డిసి) కొండయ్య, కలెక్టరేట్ ఏవో శివ రాముడు,టూరిజం అధికారి విజయ, సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, తాహసిల్దార్ రమేష్, కలెక్టరేట్ సూపరిన్డెంట్లు గోవింద్ సింగ్, వెంకటేశ్వర్లు,శ్రీనాథ్,ఇంద్రాణి, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు ఎరుకల రాజు, కుశలన్న, హరి ,ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు. ఆర్ చంద్రప్ప రామరాజు, వెంకటేష్, లంబాడ సంఘం నాయకులు యోగేష్ నాయక్, శంకర్ నాయక్, కైలాష్ నాయక్ లు ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**మహానంది, జూలై 4 (మనంన్యూస్) :** మహానంది మండలం తమ్మడపల్లె గ్రామం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గత ఎనిమిది సంవత్సరాలుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన శ్రీ ఏ.వి.ఎన్ కృష్ణ ప్రసాద్ మరియు శ్రీమతి వై రాఘవేంద్రమ్మ గార్లకు పాఠశాల



ప్రధానోపాధ్యాయులు వై రామ పక్కిరెడ్డి అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారి శ్రీ ఎం రామసుబ్బయ్య గారి సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సభ్యులు మరియు తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీ ఏం రామసుబ్బయ్య గారు మాట్లాడుతూ వీరిరువురు పాఠశాలకు ఉత్తమ సేవలందించారన్నారు మరి ఈ పాఠశాల ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా రూపొందడానికి వీరి కృషి ఎంతో ఉందని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సుబ్బారావు, కమిటీ సభ్యులు సుబ్బయ్య ఉపాధ్యాయులు అనురాధ సాయి లక్ష్మి రత్నకుమారి శ్రీనివాసులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలో పెండింగ్ పాఠ్యపుస్తకాలు విడుదల చేయాలి...

- పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో డి.ఆర్.ఓ వెంకరమణమ్మ కు వినతి....

**కర్నూలు, జులై 04మనం న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు పెండింగ్ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డి.ఎస్.యు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కర్నూల్ కలెక్టర్ కార్యాలయం లో డిఆర్ఓ




వెంకటరమణమ్మ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించి దాదాపు 20 రోజులు గడుస్తున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందించలేదాన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులని పుస్తకాలు ఇవ్వకపోతే విద్యార్థులు బడులకు వెళ్లడం మానేస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిదంగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల చదివే విద్యార్థులకు కార్పొరేట్ దీటుగా విద్యను అందిస్తామన్నా కూటమి ప్రభుత్వం పుస్తకాలే ఇవ్వకపోతే ఎలా చదువుకుంటారు అని వారు అన్నారు.కావున రాష్ట్ర ప్రభుత్వం,అధికారులు స్పందించి పెండింగ్ లో పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, స్కూల్ డ్రెస్ విద్యార్థులకు తక్షణమే అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు మునిస్వామి, వినయ్,ప్రసాద్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

- టీడీపీ ఇంఛార్జ్ ఎన్ రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం జూలై 4 మనం న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి, మంచాల సొసైటీ సహకార సంఘం చైర్మన్ ఎన్ రామకృష్ణారెడ్డి, టిడిపి యువ నాయకులు ఎన్ రాకేష్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాధవరం తెదేపా కార్యాలయంలో మంత్రాలయం , కౌతాళం మండలానికి చెందిన బాధితులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు.



మంత్రాలయం గ్రామానికి చెందిన ప్రదీప్ కు రూ. 41,250 ,చెట్నీహళ్లి గ్రామానికి చెందిన వడ్ల నరసింహులు కు రూ. 41,556 చిలకలడోన గ్రామానికి చెందిన దాసరి వరలక్ష్మి కి రూ. 20,000 గోండుపోగుల ప్రకాష్ కు రూ. 75,000 అలాగే కౌతాళం మండలం లోని కౌతాళం చాకలి నాగవేణికి రూ. 40,503 యం. వినోద్ కు రూ. 32,900 రూపాయలు, హల్వి గ్రామానికి చెందిన లలితకురూ. 36 ,200 రూపాయలు చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. మొత్తం రూ. 2,87,409 రూపాయల చెక్కులను లబ్దిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ నాయకులు చావిడి వెంకటేష్, వరదరాజు, కమ్మరి నరసింహులు, రాఘవేంద్ర, శివ కుమార్, కౌతాళం మండల టీడీపీ నాయకులు సతీష్ నాయుడు, సురేష్ నాయుడు, టిప్పు సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వస్తువులను నిరోధించాలి


**కౌతాళం, జూలై 4 (మనం న్యూస్) :** ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వస్తువుల నిరోధించాలని సమాచార హక్కు ఐక్యవేదిక మండల నాయకులు,పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేయటం. ప్లాస్టిక్ వస్తువులు నిరోధించాలని హోటళ్లలో టీ కప్పులు కవర్లు



కనబడుతూనే ఉన్నాయి హోటల్ పై చర్య తీసుకోవాలని, అలాగే కిరాణి షాపులలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు శర మామూలుగానే అమ్ముకోవడం బట్టల షాపులు ఇలా చాలా చోట్ల అమ్ముతున్నారు. ప్లాస్టిక్ ని అరికట్టడం వల్ల పర్యావరణంలో భాగస్వాములు అవుతారని కౌతాళం మండలం ఎండిఓకి కౌతాళం గ్రామ పంచాయతీ కార్యదర్శి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సమస్య విన్నపం చేయవారు వై రామచంద్ర, బద్రి స్వామి, ఈ. ఉమేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీ- నీవా ద్వారా పంట పొలాలకు పిల్ల- కాలువల నిర్మాణం చేపట్టాలి

- గ్రామాల రైతులకు సాగునీరు ఇవ్వాలి
- ఎంపీ పంచలింగాల బస్తిపాటి నాగరాజు



**దేవనకొండ, జులై 4 (మనం ప్రతినిధి) :** హంద్రీ - నీవా ద్వారా పిల్ల కాలువలను నిర్మాణం పూర్తి చేసి చివరి ఆయకట్టు దాకా సాగునీరు అందించాలని సిపిఐ మండల కార్యదర్శి నరసరావు,ఏపీ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు కండప్ప, యూసఫ్ భాషలు కర్నూలు ఎంపీ ను కోరారు. బుధవారం దేవనకొండకు వచ్చిన ఎంపీ పంచలింగాల భక్తిపాటి నాగరాజుకు ఏపీ రైతు సంఘం,సిపిఐ, సిపిఎం పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో హంద్రీ - నీవా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు,రైతులు కలిసిసాగునీటి సమస్యపై వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....దేవనకొండ మండలంలో హంద్రీ - నీవ ప్రధాన కాలవ ద్వారా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రధానంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువకు' గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి హంద్రీ - నీవా ప్రధాన కాల ద్వారా సమీపంలోని రైతుల పంట పొలాలకు మండలంలోని రైతుల ' పంట పొలాలకు పిల్ల కాలువల ' నిర్మాణం చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాండు,రామాంజనేయులు, అనుమప్ప, వీరస్వామి, నాగరాజు, భాస్కర్, మధు, వీరాంజనేయులు, లక్ష్మన్న, సుబ్బయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

**కౌతాళం, జూలై 4 మనం న్యూస్ :** మండల కేంద్రమైన కౌతాళంలో శుక్రవారం రోజున సీఐ అశోక్ కుమార్ కు కౌతాళం నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది కౌతాళం పోలీస్



స్టేషన్ గుంటూరు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిలీ సింగయ్య ఎస్సీ మాదిగ కుల వ్యక్తిని కించపరిచే విధంగా అసభ్యకరంగా వ్యాఖ్యలు వ్యాఖ్యానించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పై ఎస్సీ/ఎస్టీ నిబంధన ప్రకారం ఫిర్యాదు. గుంటూరు జిల్లా ఏటుకూరు సమీపంలో తేదీ 18/6/2025 లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు మృతిచెందిన వ్యక్తిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మీడియా సమావేశంలోమాట్లాడుతూ చేసిన ఘోరమైన, కుల ప్రతిపాదికన తక్కువ చేసి, ఎస్సీ మాదిగ సామాజిక వర్గం మనోభవాలు దెబ్బ తినే విధంగా వాక్యాలపై ఎస్సీ ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం, 1989 దెబ్బ తినే విధంగా వాక్యాలపై బిఎన్ఎస్ చట్టంలోని అనుకూలమైన సెక్షన్ల ప్రకారం ఈ ఫిర్యాదును దాఖలు చేస్తున్నాను. ఈ కేసు ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉంది ఇటువంటి సున్నితమైన సమయంలో ప్రజా ప్రతినిధులు న్యాయ ప్రక్రియకు భంగం కలిగించకుండా బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన ప్రసంగంలో మృతుని గురించి మాట్లాడుతూ కుక్క మాదిరిగా తీసి పక్కన పడేసి వెళ్లిపోయారు అనే పదాలను వాడారు ఈ వాక్యాలు అమానుషమైనది, అవమానకరమైనవి మరియు ఎస్సీ మాదిగ వ్యక్తి గౌరవాన్ని మాత్రమే కాదు, మొత్తం సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉన్నాయి.

## శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేయాలి

**బేతంచేర్ల, జూలై 4(మనంన్యూస్) :** పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేయాలని డి.సి.హెచ్.ఓ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ లలిత కు బేతంచెర్ల వైద్యులు సాగరిక వెంకటేశ్వర్లు వారికి స్థానిక వైద్యశాల నందు సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ వినతి పత్రాన్ని అందజేసి అనంతరం మాట్లాడుతూ బేతంచెర్ల మండల ప్రజలకు అత్యవసరమైన గుండెపోటు పెరాలసిస్ మందులను



శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో నిల్వ ఉంచాలని అదేవిధంగా వర్షాకాలంలో పొలాల్లో పనిచేసుకునే రైతులు వ్యవసాయ కూలీలు ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా ఏ ఒక్కరి ప్రాణం పోకుండా అవసరమైన మందులను నిల్వచేసి కుక్కకాటుకు సరిపడ టీకాలను అందుబాటులో ఉంచాలని పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు రవాణా ఖర్చులతో అత్యంత భారమైన పోస్టుమార్టం ను బేతంచర్ల ప్రభుత్వ వైద్యశాలలోనే నిర్వహించాలని ప్రజల సౌకర్యార్థం ఎక్సే తో పాటుగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని బేతంచర్ల ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేయాలని కోరారు.

# విద్యా సంవత్సరం మొదలైన ప్రారంభం కానీ డిగ్రీ అడ్మిషన్లు నోటిఫికేషన్

- తక్షణమే డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల చేయాలి
- రిపబ్లికన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్




**కర్నూలు, జూలై 04మనం న్యూస్ :** విద్యా సంవత్సరం ప్రారంభం అయిన ప్పటికీ ఇంతవరకు డిగ్రీ అడ్మిషన్ల నోటిఫి కేషన్ ఉన్నత విద్యా మండలి విడుదల చేయలేదని తక్షణమే విడుదల చేసేటట్లు చర్యలు చేపట్టాలని రిపబ్లికన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బిర్లా గేట్ లో ఉన్న స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ విద్యార్థులుకు ఇంటర్ ఫలితాలు విడుదలై రెండున్నర నెల పూర్తి అయి, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసి నెల కవస్తున్న ఇంతవరకు ఉన్నత విద్యా మండలి అధికారులు విడుదల చేయడంలో జాప్యం జరుగుతుందని, ప్రతి ఏటా మే జూన్ లో ప్రక్రియ ప్రారంభించి జూలైలో మొదటి వారంలో సంవత్సరం తరగతులు ప్రారంభించే వారిని, ప్రక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే మూడు దశలల్లో ప్రక్రియ పూర్తయిందని, కావున ఉన్నత విద్యా మండలి అధికారులు జోక్యం చేసుకొని విద్యార్థులకు న్యాయం చేసే విధంగా త్వరగా డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ ను ప్రారంభించే దానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మధు, కార్తీక్, బాషా, సుధాకర్ లు పాల్గొన్నారు.

### నా ఫ్యామిలీ గురించి నీకెందుకు? 'ది లివర్ డాక్'పై చెస్ స్టార్ విదిత్ గుజరాతీ ఫైర్

డాక్టర్స్ డే (జులై 1) సందర్భంగా భారత యువ చెస్ స్టార్ విదిత్ గుజరాతీ ఓ పోస్టు చేశాడు. అతడి పోస్టుపై 'ది లివర్ డాక్' ఖాతా నిర్వాహకుడు సైరియాక్ అబ్బి ఫిలిప్స్ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తన కుటుంబ సభ్యులపై చేసిన వ్యాఖ్యలను విదిత్ ఖండిస్తూ సమాధానం ఇచ్చాడు. అసలేం జరిగిందంటే..? డాక్టర్స్ డే పురస్కరించుకుని విదిత్ ''నా కుటుంబానికి హ్యాపీ డాక్టర్స్ డే'' అని పోస్టు చేశాడు. దానికి 'ది లివర్ డాక్' సైరియాక్ స్పందిస్తూ.. '' నన్ను క్షమించాలి. వారిలో ఎవరూ నిజమైన వైద్యులు కారు'' అంటూ కామెంట్ చేశారు. దీనిపై విదిత్ స్పందిస్తూ.. '' వ్యక్తిగతంగానూ, బ్రాండ్‌గానూ ఇతరులను నిందిస్తూ, అవమానిస్తూ ఎదగడమే నీకు తెలుసు. మా పేరెంట్స్ ఎంతోమందికి సాయం చేశారు. ముందు నీ పరిధిలో ఉండు. ఎవరికైనా ఉపయోగపడేలా ఇకనైనా మారు'' అని గట్టిగా బదులిచ్చాడు.


# ఇంగ్లాండ్ మాజీ మొదలెట్టాడు..



భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తుందని అనిపిస్తే చాలు.. ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు తమ అక్కసు వెళ్లగక్కేందుకు సిద్ధంగా ఉంటారు. గత ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో టీమ్‌ఇండియా ఒకే వేదికపై ఆడిన సంగతి తెలిసిందే. ఛాంపియన్‌గా నిలిచేందుకు ఇదే కారణమంటూ ఇంగ్లాండ్ మాజీలు ఆక్షేపించారు. ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతోన్న రెండో టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు (587) చేయడం.. ఇంగ్లాండ్ త్వరగా మూడు వికెట్లను కోల్పోవడం వారికి కంటగింపుగా మారింది. దీంతో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ డేవిడ్ లాయిడ్ తన నోటికి పని చెప్పడం గమనార్హం. రెండో రోజు ఆటలో భారత ప్లేయర్లు తరచూ బ్రేక్‌లు తీసుకోవడంపై అసహనం వ్యక్తంచేశాడు. మరీ ముఖ్యంగా రవీంద్ర జడేజాను టార్గెట్ చేసినట్లుగా వ్యాఖ్యానించాడు.

''రెండో రోజు ఆట ప్రారంభమైన 15 నిమిషాలకే జడేజా ఆటను ఆపాడు. డ్రింక్స్‌తోపాటు మాత్రలు వేసుకున్నాడు. మళ్లీ 40 నిమిషాల తర్వాత మరోసారి బ్రేక్ తీసుకున్నాడు. అక్కడ అంపైర్లు నిస్సహాయంగా నిలబడ్డారు. అందుకే, కొన్ని ఓవర్లు కోల్పోవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. తప్పకుండా అధికారులు దీనిపై దష్టిసారించి చర్యలు తీసుకోవాలి. ఐసీసీ నుంచి మార్గదర్శకాలు రావాలి. ఏ బ్యాటరైనా గాయపడితే అతడికి బదులు మరొకరు క్రీజ్‌లోకి రావాలి. ఆట కొనసాగుతూనే ఉండాలి. అంతేకానీ, గడ్డి పెరిగిందని చూసేందుకు మా సహచరులు ఇక్కడికి 85 యూరోలు (దాదాపు 10 వేలు) పెట్టి రాలేదు'' అని వ్యాఖ్యానించాడు.

# అండర్ -16 రోజులను గుర్తు చేశావు: కుమారుడి ఇన్నింగ్స్‌పై గిల్ తండ్రి సంతోషం



ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ద్విశతకం బాదాడు. ఏకంగా 269 పరుగులు చేసి అత్యధిక స్కోరు చేసిన ఆసియా సారథిగా నిలిచాడు. ఈక్రమంలో ట్రిపుల్ సెంచరీ మిస్ కావడం అభిమానులను బాధించినా.. అతడి ఆటతీరు మాత్రం ఆకట్టుకుంది. తన కుమారుడి సుదీర్ఘ ఇన్నింగ్స్‌పై గిల్ తండ్రి లక్విందర్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తల్లిదండ్రులు పంపించిన వాయిస్ మెసేజ్‌ను గిల్ వింటున్న వీడియోను బీసీసీఐ సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

''అద్భుతంగా ఆడావు. నీ బ్యాటింగ్‌ను చాలా ఆస్వాదించా. ఇప్పుడు నా మనసు చాలా ప్రశాంతంగా ఉంది. నీ ఆటను చూస్తుంటే.. అండర్-16, అండర్-19 రోజుల్లో ఆడినట్లే అనిపిస్తోంది. నీ ఆట చూసి గర్వపడుతున్నా'' అని గిల్ తండ్రి వ్యాఖ్యానించారు. ''నీ బ్యాటింగ్‌ను చూస్తుంటే చాలా ఆనందమేసింది. మున్ముందూ ఇలాగే ఆడుతూ ఉండాలి'' అని గిల్ తల్లి ఆకాంక్షించారు. భారీ ఇన్నింగ్స్ మాత్రమే కాకుండా.. రెండోరోజు ఆటలో అత్యంత క్లిష్టమైన క్యాచ్‌ను అందుకొని శభాష్ అనిపించుకున్నాడు.

**వారిద్దరి అభిప్రాయాలే ముఖ్యం..**

''ఇలాంటివి ఎన్నో ఆయన నుంచి నాకు వస్తూనే ఉంటాయి. అలాగే నేను ట్రిపుల్ సెంచరీ చేజార్చుకోవడం పైనా మేం మాట్లాడుకున్నాం. అయితే, ఈ మ్యాచ్‌లో మేం విజయం సాధిస్తామనే నమ్మకంతో ఉన్నాం. క్రికెట్‌కు సంబంధించి ఇద్దరి అభిప్రాయాలను గౌరవిస్తా. ఒకరు మా నాన్న. మరొకరు నా ఫ్రెండ్ అభిషేక్ శర్మ. నాన్న కోసమే క్రికెట్ ఆడుతున్నా. ఇక నేను ఎక్కువగా ప్రాక్టీస్ చేసింది నా స్నేహితుడితోనే. వారు చెప్పే మాటలను జాగ్రత్తగా వింటా'' అని గిల్ వ్యాఖ్యానించాడు.

# గుడ్ వైఫ్..



సినిమాల్లో బిజీగా ఉంటూనే వెబ్‌సిరీస్‌లు చేస్తున్న నటి ప్రియమణి. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన లీగల్ డ్రామా సిరీస్ 'గుడ్ వైఫ్' . అమెరికన్ వెబ్‌సిరీస్ 'ది గుడ్ వైఫ్' ఆధారంగా అలనాటి నటి రేవతి రూపొందించారు. ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్ ఎలా ఉంది?

అడిషనల్ అడ్వొకేట్ జనరల్ గుణ శీలన్, తరుణికలది అన్యోన్య దాంపత్యం. వీరికి ఇద్దరు సంతానం. అందరికీ ఆదర్శంగా నిలిచిన ఆ జంటే.. తర్వాత అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సెక్స్ కుంభకోణం ఆరోపణలతో గుణ జైలు పాలవుతాడు. అది నిజమో, కాదో తెలియకుండానే భర్తను అసహ్యించుకుంటుంది తరుణిక. తన స్నేహితుడి సాయంతో ఎల్ఏహెచ్ అనే 'లా' సంస్థలో అసోసియేట్ అడ్వొకేట్‌గా జాయిన్ అవుతుంది. న్యాయ పోరాటంలో భాగంగా భర్త కోసమే ఆమె ఈ వత్తిలోకి తిరిగొచ్చిందని అందరూ అనుకుంటారు. మరి, తరుణిక ప్లాన్ అదేనా? గుణ జైలు నుంచి ఎలా బయటకు వచ్చాడు?అసలు అతడు తప్పు చేశాడా? కేవలం అవి ఆరోపణలేనా?

లీగల్ డ్రామా, కోర్ట్‌రూమ్ డ్రామా.. ఇలా పేరు ఏదైనా ఆయా నేపథ్య కథలపై ప్రేక్షకుల్లో ప్రత్యేక క్రేజ్ ఉంది. కోర్టులో 'నువ్వా? నేనా?' అన్నట్టు సాగే వాదప్రతివాదనలే అందుకు కారణం. అలాంటివి ఆశించి 'గుడ్ వైఫ్'ని చూస్తే నిరాశ తప్పదు. ఇందులో ఆ బ్యాక్‌డ్రాప్‌లో ఒక్క సీన్ వర్కౌట్ అయిందంతే. తమ అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా గుణ దంపతులు సెలబ్రేషన్స్ చేసుకోవడం, అదే సమయంలో ఆరోపణల కారణంగా గుణ వార్తల్లో నిలవడం, పోలీసులు అరెస్టు చేయడం.. ఆయా సన్నివేశాలతో సిరీస్ ఉత్కంఠగా ప్రారంభమైంది. కానీ, ముందుకెళ్లే కొద్దీ ఆసక్తి సన్నగిల్లుతుంది. కీలకమైన గుణ కేసును పక్కనపెట్టి, కొత్త అంశాలను తెరపైకి తీసుకురావడం గందరగోళానికి దారి తీసింది

భర్త విషయంలో ఎంత బాధ ఉన్నా తరుణిక దాన్నుంచి తేరుకుని.. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ తనను తాను నిరూపించుకోవడం వంటి సన్నివేశాలు మాత్రం ఆకట్టుకుంటాయి.

# మనసున్న రాజాసాబ్

## ఫిష్‌వెంకట్‌కు ఆపరేషన్ చేయిస్తానన్న ప్రభాస్

**ఆపరేషన్‌కు రూ. 50 లక్షలు అవసరమని కుమార్తె ఆవేదన**

**స్పందించిన హీరో ప్రభాస్ బృందం, ఖర్చులు భరిస్తామని హామీ**

**కిడ్నీ ఇచ్చే దాత కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపులు**





సినీ నటుడు ఫిష్ వెంకట్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వేళ, ఆయనకు అండగా నిలిచేందుకు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ముందుకొచ్చారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్ ఆపరేషన్కు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభాస్ బృందం హామీ ఇచ్చింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కాస్త ఊరట చెందారు. కొంతకాలంగా ఫిష్ వెంకట్ ఆరోగ్యం క్షీణించడంతో, ఆయనను బోడుప్పల్లోని ఆర్బీఎం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆయన రెండు కిడ్నీలు విఫలమైనట్లు, గత నాలుగేళ్లుగా డయాలసిస్పైనే జీవిస్తున్నట్లు ఆయన కుమార్తె స్రవంతి కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం వెంకట్ పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారని ఆమె తెలిపారు. ఇందుకు సుమారు రూ. 50 లక్షలు ఖర్చవుతుందని, దాతలు ఎవరైనా ఆదుకోవాలని ఆమె మీడియా ద్వారా వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న హీరో ప్రభాస్ బృందం వెంటనే స్పందించింది. ప్రభాస్ అసిస్టెంట్ తమకు ఫోన్ చేశారని, 'కిడ్నీ ఇచ్చే దాతను సిద్ధం చేసుకోండి, ఆపరేషన్కు అయ్యే ఖర్చు మొత్తం మేం చూసుకుంటాం' అని హామీ ఇచ్చారని స్రవంతి మీడియాకు వెల్లడించారు. ప్రభాస్ చూపిన ఉదారతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్మీ ఆఫీసర్‌గా పథ్వీరాజ్ సుకుమారన్.. 'సర్‌జమీన్' ట్రైలర్

పథ్వీరాజ్ సుకుమారన్ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'సర్‌జమీన్''. డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదల కానుంది. బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. జులై 25 నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో పథ్వీరాజ్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించగా.. ఆయన భార్య మీరా పాత్రలో కాజోల్ నటించారు. ఇబ్రహీం ఉగ్రవాదిగా కనిపించనున్నారు. కశ్మీర్ నేపథ్యంలో సాగిన ఈ చిత్రంలో దేశ రక్షణ కోసం ఆర్మీ ఆఫీసర్లు.. ఉగ్రవాదులపై ఎలాంటి పోరు చేశారు. వారు చేసిన సాహసాలేంటి అనేది చూపించనున్నారు. ఈ సినిమాతో కాయోజ్ ఇరానీ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇవ్వనున్నారు.



# ఎన్ని సవాళ్లు ఎదురైనా తమ్ముడు చేయాలనుకున్నా!




**నా సరదా వ్యక్తిత్వం... నా మాటల్లోని చాతుర్యం అప్పుడప్పుడూ నేను చేసే పాత్రల్లోనూ ప్రతిబింబిస్తూ ఉంటుందని చెబుతున్నారు వర్ష బొల్లమ్మ. 'తమ్ముడు' విషయంలో మాత్రం అలా కుదరలేదని చెప్పుకొచ్చింది. 'విజిల్' తర్వాత.. మళ్లీ 'తమ్ముడు' కోసం ప్రత్యేకంగా సన్నద్ధమై నటించానని ఆమె తెలిపారు. నితిన్ కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు'లో వర్ష బొల్లమ్మ ఓ కథానాయిక. శ్రీరామ్ వేణు దర్శకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా వర్ష గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.**

నేను గతంలో ''జాను'' అనే మూవీలో నటించాను. ''తమ్ముడు'' కోసం పిలవగానే వచ్చి ఆడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్ లో వెంటనే ఓకే అయ్యాను. దర్శకుడు వేణు గారు ఈ మూవీ గురించి చెబుతూ అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ఇప్పుడే చెప్పండి అన్నారు. నేను ఛాలెంజింగ్ గా తీసుకుని చేస్తాను అని చెప్పాను. అలా చిత్ర క్యారెక్టర్ కు నేను సెలెక్ట్ అయ్యాను.

హీరో నితిన్ క్యారెక్టర్ జై కు చిత్ర డ్రైవింగ్ ఫోర్స్‌లా ఉంటుంది. జై కు అన్‌కండిషనల్‌గా సపోర్ట్ చేస్తుంది చిత్ర. ఈ సినిమా కోసం నేను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడాన్ని ఎంజాయ్ చేశాను. తమ్ముడు మూవీ టైటిల్ ఈ కథకు యాప్ట్. పవన్ గారి ఒక సూపర్ హిట్ మూవీ ఈ టైటిల్‌తో ఉండటం మేము హ్యాపీగా ఫీలయ్యే విషయం. నా క్యారెక్టర్ కు ''తమ్ముడు'' కథలో మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలో లయ గారు మరో కీ రోల్ చేస్తున్నారు. ఆమె జర్నీ మా అందరికీ ఇన్‌స్పిరేషన్. హీరోయిన్ గా ఒక కెరీర్ చూసిన ఆమె పర్సనల్ లైఫ్ లోకి వెళ్లడం, మళ్లీ ఇప్పుడు రీ-ఎంట్రీ ఇవ్వడం స్ఫూర్తిగా తీసుకోవచ్చు.

హీరో నితిన్ చాలా కామ్‌గా ఉంటారని ఒక ఇంప్రెషన్ ఉంది. కానీ ఆయన చాలా ఫన్ పర్సన్. అడవిలో షూటింగ్ చేస్తున్నప్పుడు ఫోన్స్ అవీ ఏమీ లేవు. మేము సరదాగా మాట్లాడుకునేవాళ్లం. చిన్నా, పెద్దా ప్రతి ఆర్టిస్టుకు ఆయన గౌరవం ఇచ్చేవారు. నేను జోక్స్ చెప్పి ఆయనను విసిగించా. నాకు అనిపించింది సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేస్తుంటా. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ పర్‌ఫార్మ్ చేసేప్పుడు అప్పటికప్పుడు ఏదైనా అనిపిస్తే చెప్పాను. కానీ డైరెక్టర్ గారు డైలాగ్ లో ఉన్నది ఉన్నట్లు స్ట్రిక్ట్ గా చెప్పమనేవారు. నేను మిడిల్ క్లాస్ మెలొడీస్ చేసినప్పుడు స్పాంటేనియస్ గా చాలా ఇంప్రూవ్ చేసి డైలాగ్స్ చెప్పాం. ఆ మూవీకి అలా కుదిరింది. ప్రస్తుతం కానిస్టేబుల్ కనకం అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నాను. దీంతో పాటు మరో సిరీస్ చేస్తున్నా. రెండు సినిమాలు కూడా కన్ఫర్మ్ అయ్యాయి. వాటి డీటెయిల్స్ త్వరలో చెబుతా. సైకో కిల్లర్ క్యారెక్టర్ లో కనిపించాలనేది నా కోరిక. నేను సైకో కిల్లర్ ఏంటి అనుకుంటారు. కానీ మనం ఆ జానర్ మూవీస్ చూస్తే ఎవరూ ఊహించని పాత్రలే క్రైమ్స్ చేస్తుంటాయి. అలాంటి అవకాశం వస్తే నటిస్తా.

# 'ఎస్ఎస్ఎంబీ29' పై ప్రియాంక చోప్రా కామెంట్!



కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో 'ఎస్ఎస్ఎంబీ29' వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా ముస్తాబవుతున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రియాంక చోప్రా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో ఆమెకు సంబంధించిన ప్రతి ఇంటర్వ్యూ వైరల్‌గా మారుతోంది. తాజాగా ప్రియాంక ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన మాటలను మహేశ్ అభిమానులు షేర్ చేస్తున్నారు. తాను ప్రస్తుతం ఓ ఇండియన్ సినిమాలో నటిస్తున్నట్లు చెప్పిన ఆమె ఆ ప్రాజెక్ట్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.వివాహం అనంతరం హాలీవుడ్‌లో స్థిరపడిన ప్రియాంక తాను ఇక్కడి సినిమాలను మిస్ అవుతున్నట్లు చెప్పారు. ''నేను ఇండియాను, హిందీ సినిమాలను మిస్ అవుతున్నాను. ఈ సంవత్సరం ఓ భారతీయ సినిమాలో నటిస్తున్నాను. ఆ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇండియన్ ఆడియన్స్ నాపై చూపే ప్రేమ ఎంతో విలువైనది. అది ఎల్లప్పుడూ ఇలానే కొనసాగుతుందని ఆశిస్తున్నాను'' అని చెప్పారు. దీంతో ప్రియాంక 'ఎస్ఎస్ఎంబీ29' గురించి మాట్లాడిందంటూ అభిమానులు ఆనందిస్తున్నారు.%బావీదీ%29 విషయానికొస్తే.. ప్రస్తుతం ఇది షూటింగ్ దశలో ఉంది. అటవీ నేపథ్యంలో సాగే కథతో ప్రపంచాన్ని చుట్టేసే సాహస ప్రయాణంగా ఈ సినిమాని సిద్ధం చేస్తున్నారు రాజమౌళి. ఇందులో మహేశ్ మునుపెన్నడూ చేయని ఓ విభిన్నమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.